రంజాన్ వేళలు


ఇఫ్తార్ (బుధ) సా.6.22

సహరి (గురు) ఉ.4.48

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	37.0	24.0

వైసీపీకి 'వలంటీర్'గా..



- ఎన్నికలు సమీపించడంతో అడ్డంగా బరితెగించేస్తున్న వలంటీర్లు
- వైసీపీ నేతల ఆదేశాలతో కోడ్ ఉల్లంఘించి ఇంటింటికీ వెళ్లి ప్రచారం
- పార్టీ నేతల కార్యక్రమాల్లోనూ నేరుగా పాలుపంచుకుంటున్న వైనం
- అటు ఎన్నికల కోడ్ ఉన్నా వైసీపీ అభ్యర్థుల రహస్య సమావేశాలకు హాజరు
- అధికార పార్టీ నేతల నుంచి గిఫ్ట్‌లు, ఫోన్‌లు, నగదు, వెండి గిన్నెలు స్వీకరణ
- తమను గెలిపిస్తే ఒక్కొక్కరికి రూ.లక్ష ఇస్తామంటూ పలువురు అభ్యర్థుల ఆఫర్లు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వలంటీర్లపై భారీగా వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేకమంది వలంటీర్లు ఇంకా వైసీపీ సేవలోనే తరిస్తున్నారు. అధికారపార్టీ నేతల ప్రలోభాలకు తలొగ్గి వారి కోసం యథేచ్ఛగా పనిచేస్తున్నారు. నేరుగా వారి ప్రచార కార్యక్రమాలకు హాజరవడం దగ్గర నుంచి తమ పరిధిలో ఇంటింటికి వెళ్లి వైసీపీకి ఓటేయాలంటూ యథేచ్ఛగా అడిగేస్తున్నారు. అదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో విధులకు దూరంగా ఉండాల్సి ఉన్నా అదేం ఖాతరు చేయడం లేదు. నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు అన్ని విధాలా అండాదండా అందిస్తున్నారు. ఇదే అదనుగా ఎమ్మెల్యే అభ్యర్థులు సైతం పార్టీ కార్యకర్తలకు బదులు వీరిపైనే ఆధారపడి వారిని ఆర్థికంగా బాగా సంతృప్తిపరుస్తున్నారు. కాకినాడ జిల్లాలో అయితే పార్టీని గెలిపించుకుంటే ఎన్నికలయ్యాక ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున నగదు ఇస్తామంటూ నేరుగా ఆఫర్లు కూడా ఇస్తున్నారు. దీంతో ఇప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో ఎక్కడచూసినా వేలాదిమంది వలంటీర్లు అధికార వైసీపీ కోసం నేరుగా రంగంలోకి దిగి పనిచేస్తున్నారు. యథేచ్ఛగా కోడ్‌ను ధిక్కరిస్తున్నారు. ఈనేపథ్యంలో వీరిపై ఉమ్మడి జిల్లా నుంచి భారీగా ఈసీకి ఫిర్యాదులు కూడా వెళ్లాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా వలంటీర్ల వ్యవస్థను ప్రారంభించింది. ఒక్కో వలంటీర్‌కు గౌరవం వేతనం ఇస్తూ ప్రతి యాభై కుటుంబాలకు సంబంధించి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పర్యవేక్షణ, పింఛన్ చెల్లింపులకు వీరిని వినియోగిస్తోంది. అయితే వీరు ప్రభుత్వ ఉద్యోగులు కానందున ఇప్పుడు ఎన్నికల కోడ్ రావడంతో పక్కకు తప్పుకోవాల్సి ఉంది. ఎలాంటి ప్రభుత్వ విధులు, ఎన్నికల విధులు, అధికార పార్టీ అభ్యర్థుల కోసం ప్రచారాలు చేపట్టకూడదు. కానీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వేలాదిమంది వలంటీర్లలో సింహభాగం మంది నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల ఇళ్లకు వెళ్లి వారితో రహస్య సమావేశాల్లో పాల్గొంటున్నారు. అలాగే అభ్యర్థుల ఆదేశాలతో తమ పరిధిలో కుటుంబాల వద్దకు వెళ్లి నిబంధనలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. ఇందుకుగాను వీరికి వైసీపీ అభ్యర్థులు భారీ ఆఫర్లు ఇస్తున్నారు. ఇప్పటికే కాకినాడ జిల్లాలోని తుని, పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, జగ్గంపేట తదితర నియోజకవర్గాల్లో వలంటీర్లకు అధికార పార్టీ నేతలు ఖరీదైన సెల్‌ఫోన్లు, వాచీలు, ఇతర గిఫ్టులు అందించారు. తమను గెలిపిస్తే ఎన్నికలు అయ్యాక రూ.లక్ష చొప్పున ఇస్తామంటూ ఆఫర్లు ఇచ్చారు. దీంతో ఎక్కడికక్కడ వలంటీర్లు యథేచ్ఛగా బరితెగించేస్తున్నారు. అభ్యర్థులు, వారి అనుచరులు నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారాలు, సమావేశాలకు నేరుగా హాజరవుతున్నారు. ఇంటింటికి వెళ్లి వైసీపీకి ఓటేయాలంటూ ప్రజలపై ప్రలోభాల వల విసురుతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ వలంటీర్ల తీరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్న వీరిపై చర్యలు తీసుకోవాలంటూ ఇప్పటికే ప్రతిపక్షాలు ఎన్నికల కమిషన్‌కు వందల్లో ఫిర్యాదులు పంపాయి. ఇప్పటికే తునిలో వలంటీర్ల తీరుపై ఈసీకి ఫిర్యాదులు వెళ్లడంతో చర్యలకు రంగం సిద్ధమవుతోంది.

16 మంది వలంటీర్లపై వేటు

'సిద్ధం' కార్యక్రమాలకు తామూ సిద్ధమంటూ అత్యుత్సాహం ప్రదర్శించిన వలంటీర్లపై వేటు పడింది. ఎన్నికల కమిషన్ నిబంధనలు బేఖాతరు చేసిన వారిని పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాలతో అంబాజీపేట ఇన్‌చార్జి ఎంపీడీవో కె.వరలక్ష్మి సస్పెండ్ చేశారు. అంబాజీపేట మండలం మొసలపల్లి, ఇరుసుమండల్లో 'సిద్ధం' పేరిట వైసీపీ నాయకులు సోమవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయా గ్రామాలకు చెందిన 16 మంది వలంటీర్లు పాల్గొన్నారు. మొసలపల్లిలో కొందరు వలంటీర్లు సీఎం జగన్ జై అంటూ నినాదాలు కూడా చేశారు. వైసీపీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరుతూ ఓటర్ల జాబితాతో ఉన్న 'సిద్ధం' బ్యాగ్‌లను ముఖ్య నేతలు బూత్ కన్వీనర్లకు అందించారు. ఈ ఉదంతంపై మంగళవారం ఆంధ్రజ్యోతి కోనసీమ జిల్లా మెయిన్‌లో వచ్చిన వార్తకు అధికారులు స్పందించి సస్పెండ్ చేయడంతోపాటు ఎందుకు పాల్గొన్నారో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని వలంటీర్లకు నోటీసులు ఇచ్చారు. - అంబాజీపేట

వైసీపీ సమావేశాలకు హాజరవుతున్న వలంటీర్లు

- ఎలక్షన్ కమిషన్ ఆంక్షలు బేఖాతర్
- రాజమహేంద్రవరం సిటీలో వైసీపీ సమావేశాలకు హాజరవడంపై అర్బన్ ఆర్వో దినేష్‌కుమార్ ఆగ్రహం
- హెచ్చరికలతో సరిపెట్టడంపై విమర్శలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వలంటీర్లు బరితెగిస్తున్నారు. ఎన్నికల సమయంలో వలంటీర్లను వాడుకోవద్దని ఎన్నికల కమిషన్ హెచ్చరించినా పట్టించుకోవడం లేదు. అధికార వైసీపీ నేతల ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లొంగి వైసీపీ మీటింగ్‌లకు హాజరవుతున్నారు. అంతేకాక వైసీపీ అభ్యర్థులు కూడా వలంటీర్లతో ఇంటింట ప్రచారం చేయించడానికి, ప్రతీ లబ్ధిదారుడికి రూ.లక్షల్లో లబ్ధి చేకూరినట్టు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేయించడానికి సన్నద్ధం చేశారు. గతంలో జీతం పెంచమని అడిగితే, సుమారు 100మందికిపైగా వలంటీర్లను సస్పెండ్ చేసిన అధికారులు, వారిలో మళ్లీ కొంతమందిని విధుల్లోకి తీసుకున్నారు. ఇటీవల వైసీపీ నేతలు నియోజకవర్గాల వారీ గిఫ్టులు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. ఇంకా ఎన్నికలు దగ్గరకు వచ్చే సమయంలో డబ్బు కూడా ఇస్తామని ప్రలోభాలు పెట్టి వాళ్ల చేత పనిచేయించుకునే పనిలో ఉన్నారు. రాజమహేంద్రవరం సిటీలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత కూడా సిటీ అభ్యర్థి మార్గాని భరత్ డివిజన్‌ల వారీ బూత్ ఇన్‌చార్జిలతో మీటింగ్‌లు పెడుతూ అక్కడకు వలంటీర్లను కూడా పిలుస్తున్నారని చెబుతున్నారు. ఈ విషయం బయటకు రావడంతోపాటు రాజమహేంద్రవరం అర్బన్ ఆర్వో, మున్సిపల్ కమిషనర్ దృష్టికి వెళ్లగా సుమారు 20 మందికిపైగా వలంటీర్లను పిలిచి హెచ్చరించడం గమనార్హం. వచ్చే నెలలో పింఛన్లు ఇచ్చే సమయంలో కూడా వలంటీర్లతో నేరుగా ఓటర్లకు వైసీపీకి ఓటు వేయమని చెప్పించడానికి ఆ పార్టీ నాయకులు ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. ఇక రాజమహేంద్రవరం సిటీలో వైసీపీ నేతల సమావేశాలకు హాజరై, అధికారికంగా అధికారుల దృష్టిలో ఉన్నప్పటికీ వాళ్లను హెచ్చరించి వదిలేయడం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమేననే వాదన మొదలైంది. సిటీలో వైసీపీ అభ్యర్థి పెట్టిన బూత్ కమిటీల మీటింగ్‌లకు హాజరైన సుమారు 20మందికి పైగా వలంటీర్లను మంగళవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఉన్న మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్ తన దగ్గరకు పిలిచి ఆగ్రహం వ్యక్తం చేశారు. సస్పెండ్ చేస్తానని, తీవ్ర చర్యలు తప్పవని, పోస్టు నుంచి తీసివేస్తామని హెచ్చరించినట్టు సమాచారం. ఎన్నికల కమిషన్ ఆదేశించినప్పటికీ, పట్టించుకోకుండా వలంటీర్లు వైసీపీ మీటింగ్‌కు వెళ్లడం ఉల్లంఘనే. అంతేకాదు... వారి మీద చర్యలు తీసుకోకపోవడం కూడా నియమావళి ఉల్లంఘన కిందకే వస్తుందని ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికే కోనసీమ జిల్లాలో 16 మంది వలంటీర్లను సస్పెండ్ చేశారు. ఇప్పటికైనా వలంటీర్లు బరితెగింపు విధానాలు మానకపోతే ఇబ్బందుల్లో పడక తప్పదు.

వలంటీర్లకు తాయిలాలపై తునిలో విచారణ

తుని రూరల్, మార్చి 19: కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో 1000మందికిపైగా వలంటీర్లకు, కొంతమంది పోలీస్ సిబ్బందికి సెల్‌ఫోన్‌లు పంపిణీ చేశారని, వెలుగు, మెప్మా పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి నగదు పంపిణీ చేశారని ఆరోపిస్తూ టీడీపీ నేతలు ఈసీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. దీనిపై ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ద్వారా వలంటీర్ల నుంచి వివరణ తీసుకోవాలని ఎంపీడీవోలకు ఆదేశాలు ఇచ్చారు.

జగన్ కటౌట్‌పై మాజీ ఎన్నికల కమిషనర్ ఫిర్యాదు



రాష్ట్రంలో ఎన్నికల నియమావళిని అపహాస్యం చేస్తున్నారంటున్నారు రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనరు, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌కుమార్. మంగళవారం ఉదయం రాజమహేంద్రవరం నుంచి పశ్చిమగోదావరి జిల్లా తణుకు కారులో వెళ్తున్న ఆయన్ను ఆలమూరు మండలం జొన్నాడ జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద ఆపి తనిఖీ చేశారు. ఈ సమయంలో ఆయనకు సీఎం జగన్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కటౌట్ ఉన్న పెద్ద హోర్డింగ్ కనిపించింది. మధ్యాహ్నం తిరిగి వెళుతుండగా ఆయన జొన్నాడ వద్ద ఆగి ఆ హోర్డింగ్‌ను మీడియాకు చూపించారు. విషయం తెలుసుకున్న అధికారులు స్పందించి సాయంత్రం హోర్డింగును తొలగించారు. - ఆలమూరు



కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థిగా తంగెళ్ల ఉదయ్

- ప్రకటించిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్

కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థిగా ఆ పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, టీ టైం అధినేత తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌ను పవన్ మంగళవారం ప్రకటించారు. వాస్తవానికి కాకినాడ ఎంపీ సీటు నుంచి టీడీపీ అభ్యర్థి బరిలోకి దిగుతారని తొలుత చర్చ జరిగింది. కానీ పొత్తు నేపథ్యంలో టిక్కెట్‌ను జనసేన దక్కించుకుంది. దీంతో పలువురు పోటీకి సిద్ధమైనా అసలు అభ్యర్థి ఎవరనేదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. స్వయంగా పవన్‌కల్యాణ్ బరిలోకి దిగుతారంటూ కొంతకాలం విస్తృతంగా చర్చ నడిచింది. కానీ తాను పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని పవన్ ఇటీవల ప్రకటించడంతో కొంత గందరగోళానికి తెరపడింది. - 7లో



కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి రథోత్సవ దృశ్యం (ఫైల్‌ఫొటో)

నరసన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

నేడు కల్యాణోత్సవం.. రథోత్సవం

- 7లో



ఎన్నికల యంత్రాంగానికి దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్, జేసీ

ఈ.. ఆస్తులపై ఎన్నికల ప్రచారం నిషేధం

- ప్రభుత్వ ఆస్తులు, ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రచారం కుదరదు
- ప్రైవేట్ భవనాలపై వాల్ రైటింగ్స్‌కు అనుమతి లేదు
- ఆటోలు, ఇతర వాహనాలపై పార్టీల ఫోటోలు, స్లోగన్స్ నో
- జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత

రాజమహేంద్రవరం,మార్చి19(ఆంధ్రజ్యోతి): ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఇష్టానుసారం ప్రచారం చేసుకోవడానికి వీలులేదు. బరితెగించే రాజకీయ పార్టీలను దృష్టిలో పెట్టుకునే, అనవసర ప్రచారానికి అడ్డుకట్ట వేయాలో, ఓటర్లను ప్రభావితులు కాకుండా చూడడం కోసమోకానీ ఎన్నికల కమిషన్ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రచారం విషయంలో కఠిన నిబంధనలు అమలులోకి తెచ్చింది. అంతేకాదు రోడ్ల పక్కన ఉన్న ప్రధాన హోర్డింగ్‌లను అన్ని పార్టీలకు సమానంగా కేటాయించాలని కూడా ఆదేశించింది. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్‌మీనా మంగళవారం జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈసందర్భంగా ముఖేష్‌కుమార్ సూచించిన విషయాలను కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత జిల్లాలోని ఎన్నికల యంత్రాంగానికి వివరించారు. ప్రభుత్వ, వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగ్‌లు, పోస్టర్లు, బ్యానర్లకు అనుమతి లేదన్నారు. జాతీయ రహదారి, ఇతర రోడ్లపక్కన ఉన్న హోర్డింగ్‌లు అన్ని రాజకీయ పార్టీలకు సమానంగా ఇవ్వాలన్నారు. పైగా నూతన హోర్డింగ్‌లకు కూడా అనుమతి లేదన్నారు. ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ ప్రకటనలు, పోస్టర్లు, హోర్డింగ్‌లు, బ్యానర్ల ప్రదర్శన విషయంలో జిల్లా ఎన్నికల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖేష్‌కుమార్ ఆదేశించారు. ప్రైవేట్ భవనాలు వాల్ రైటింగ్‌కు అనుమతి లేదని, ఇప్పటికే రాతలు ఉంటే చెరిపివేయాలని కూడా సూచించారు. ప్రభుత్వ అనుమతితో ఇప్పటికే ప్రైవేట్ భవనాలు ఉన్న పెద్ద హోర్డింగ్‌లు, కటౌట్ల భద్రతను నిర్మాణ స్థిరత్వాన్ని పరిశీలించి, నిర్మాణంలో ఏమాత్రం ధృఢత్వం లేకపోయినా ప్రకటలకు అనుమతించవద్దని కూడా సూచించారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి ఓటర్లను ప్రభావితం చేయడానికి తెచ్చే మద్యం, ఇతర రకాల వస్తువల అక్రమ రవాణాను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. రాజకీయ పార్టీలు ఉద్యోగులకు, ఓటర్లకు నగదు, బహుమతుల వంటి తాయిలాలు పంపిణీ చేసే అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తామన్నారు. సీ-విజిల్ ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించడానికి ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్మెంట్ వ్యవస్థను పెద్దఎత్తున వినియోగించుకోవాలన్నారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లు, విమానాశ్రయం, వంతెనలు, రైల్వే రోడ్‌వేలపై ప్రచారాలు నిషేధం అన్నారు. వ్యాపార సముదాయాల వద్ద వ్యాపార ప్రకటనలు తప్ప రాజకీయ ప్రచారం కోసం వినియోగించకూడదని హెచ్చరించారు. కార్లు, ఆటోలు, ఇతర వాహనాల మీద ఎటువంటి రాజకీయ పార్టీల ఫోటోలు, స్లోగన్స్ ఉండకూడదని, ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో రాజమహేంద్రవరం రూరల్ ఆర్వో జేసీ ఎన్.తేజ్‌భరత్, అర్బన్ ఆర్వో, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, కొవ్వూరు ఆర్వో సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్, డీర్వో జి.నరసింహులు, రాజానగరం ఆర్డీవో ఎ.చైత్ర వర్షిణి, గోపాలపురం ఆర్వో కెఎల్.శివజ్యోతి, నిడదవోలు ఆర్వో ఆర్‌వీ రమణానాయక్, అనపర్తి ఆర్వో ఎం.మాధురి తదితరులు పాల్గొన్నారు.



క్రెడిట్ ప్లాన్ విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్

2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.13,201 కోట్లతో రుణ ప్రణాళిక

రాజమహేంద్రవరం రూరల్,మార్చి19: జిల్లాకు సంబంధించి వ్యవసాయ, అనుబంధ రంగాలకు 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను 13 వేల 201కోట్ల రుణ ప్రణాళికతో డాక్యుమెంటు రూపొందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి క్రెడిట్ ప్లాన్‌ను సంబంధిత అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ ఆర్థిక సంవత్సరానికి చెందిన వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి రుణాలను విరివిగా అందించాలని బ్యాంకర్లను కోరారు, ఈ సందర్భంగా నాబార్డు జిల్లా అధికారి డాక్టర్ వైఎస్ నాయుడు వివిధ బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్య సాధన వివరాలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, హార్టీకల్చర్ అధికారి సుజాతకుమారి, డీసీసీబీ, సీజీజీ బ్యాంక్, ఇతర బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యూషకుమారి

ఖైదీల పిల్లల పట్ల వివక్ష తగదు

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

రాజమహేంద్రవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఖైదీల పిల్లల పట్ల సమాజంలో వివక్ష తగదని.. అలాంటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి పేర్కొన్నారు. మంగళవారం కేంద్ర కారాగారంలోని ఖైదీల కుటుంబ సభ్యులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆస్తి వివాదాలు, కుటుంబ సభ్యుల మధ్య సమస్యలు, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోవడం, ఆర్థిక సమస్యల వల్ల పిల్లల చదువులు ఆగిపోవడం వంటి ఇబ్బందులు ఉంటే డీఎల్ఎస్ఏని సంప్రదించడం ద్వారా పరిష్కారం దొరుకుతుందని ఆమె చెప్పారు. అలాగే ఓఎన్‌జీసీలో ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో వివిధ మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు.

వైసీపీ పంకా వంకరే



- 'గాలి'లోని అంతర్గత పోరు తారస్థాయికి
- ప్రతి నియోజకవర్గంలోనూ ఇంతే
- రాజమండ్రి సిటీ, రూరల్ చెరోదారి
- శిలాఫలకాలకే కొందరు పరిమితం
- కొవ్వూరులో బహిరంగంగా కుమ్ములాటలు
- నిడదవోలు, రాజానగరం, అనపర్తిలో
- సొంత సామాజికవర్గం నుంచీ వ్యతిరేకత

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తుతో పరుగులు పెడుతుంటే.. జిల్లాలోని వైసీపీ పంకా వంకర పోతోంది. 'గాలి'కి వేగలేక వైసీపీ నాయకులు అల్లాడుతున్నారు. అంతర్గత పోరు, వర్గ విభేదాలకు వైసీపీ పెట్టింది పేరు. ముందు నుంచీ పార్టీలో అదే తీరు. ఎన్నికల వేళ సమీపిస్తుండడంతో అది మరీ తారస్థాయికి చేరింది. సమావేశాల్లో బహిరంగంగానే విమర్శించుకుంటున్నారు. వర్గాల వారీగా వైసీపీ నాయకులు విడిపోయారు. ఎవరి దారి వారిదే అన్నట్టుగా పయనం సాగుతోంది. ఉదాహరణకు రాజమహేంద్రవరంలోని ఆర్యాపురం అర్బన్ బ్యాంకు చైర్మన్ పదవి విషయం రచ్చకెక్కింది. తన వారికి దక్కించుకోవాలని ఎంపీ భరత్, తమ వారికే పదవులు రావాలని మంత్రి వేణు సిగపట్లు పడుతున్నారు. అటు కొవ్వూరులోని సమన్వయకర్త విషయంలో కాపు వర్గం భగ్గుమంటోంది. ఏదేమైనా పార్టీలో అంతర్గత కుమ్ములాటలు జటిలంగా మారాయి. వైసీపీ పంకా ముందు నుంచీ వంకరేననే మాటను రుజువు చేస్తున్నాయి.

- **సిటీలో అంతేగా..**

రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్ తన పరిధిలోని ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లనూ వదిలేసి రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గానికే పరిమితమై కార్యకలాపాలు సాగించారు. ఆయన కోరుకున్న విధంగానే వైసీపీ తరపున సిటీ నియోజకవర్గం నుంచి బరిలో నిలవడం ఖాయమైంది. అయితే రాజమహేంద్రవరంలో నేనేరాజు నేనే మంత్రి అనే చందంగా లాక్కొచ్చిన భరత్ రామ్‌కి కూడా ఈమధ్య అసహనం పెరిగిందని వైసీపీ వర్గాల్లో ఎక్కువగా వినిపిస్తోంది. ముందునుంచీ పార్టీలోని పెద్ద వ్యక్తులను ఎవరినీ దగ్గరకు రానీయలేదు. ఎంపీగా తన పదవీకాలం చివరిలో రాజమహేంద్రవరం సిటీకి సంబంధించి ఇద్దరు ముగ్గురు పెద్దల అనుభవాన్ని ఓట్ల కోసం గౌరవించే పాచిక వేశారు. ఇందులో ప్రధానంగా ఎన్నికలు ఇంకా మూడు నెలలు ఉన్నాయనగా భరత్‌కి వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు గుర్తొచ్చారు. ఆయనకు గుడా చైర్మన్‌గా స్థానం కల్పించారు. ఇన్నేళ్లూ ఆయనను కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇక తనను వ్యతిరేకించే మేడపాటి షర్మిలారెడ్డికి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవి ద్వారా రాజమహేంద్రవరం నగరంతో ఉన్న సంబంధాల్ని దూరం చేసే వ్యూహం పన్నారని ఇప్పటికే ఆ పార్టీ వర్గాల్లో చర్చ నడిచింది. మరోవైపు రాజానగరం నియోజకవర్గానికే జక్కంపూడి రాజా కుటుంబాన్ని భరత్ రామ్ పరిమితం చేయగలిగారు. ఇదే సమయంలో భరత్ రామ్ తీరుతో వైసీపీలో అంతర్గత పోరు నడుస్తూనే ఉంది. ఎన్నికల నియమావళి వచ్చిన తర్వాత తొలిసారిగా సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎంపీ ఒక్కరే దర్శనమిచ్చారు. మిగతా వారినెవరినీ వేదిక ఎక్కనివ్వలేదనే అంశం ఆ పార్టీ నేతల్లో అసంతృప్తిని పెంచుతోంది.

- **రూరల్ తీరిదీ..**

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి అయిన చెల్లుబోయిన వేణుతో కూడా భరత్‌కి పొసగడం లేదనేది వాస్తవం. ఆయన వెంట జక్కంపూడి వర్గీయులు తిరుగుతుండడమే అందుకు నిదర్శనం. తాను రూరల్ ఇన్చార్జిగా నియమితులైనప్పటి నుంచీ మంత్రిగిరీ పక్కన పెట్టి నియోజకవర్గంలో కలియదిరుగుతున్నారు. అయినా ఎంపీ వెళ్లింది లేదు. సిటీ పరిధిలోని రూరల్ వార్డుల్లోని కార్యక్రమాలకు మాత్రం ఎంపీ హాజరవుతుండడం గమనార్హం. ఇక రూరల్ సీటుపై ఎప్పటి నుంచో ఆశలు పెట్టుకొని కేడర్‌ని కూడగట్టుకున్న చందన నాగేశ్వర్‌కి భరత్ తన స్టైల్లో మొండిచేయి చూపించారు. రూరల్ సీటు వేణుకు కేటాయించడంతో ముందు నుంచీ భరత్‌కి వెన్నంటే ఉన్న నాగేశ్వర్‌ని పక్కన పెట్టి శిలాఫలకాల్లో పేరుకు మాత్రమే పరిమితం చేశారు. వేణు సమావేశాల్లో కూడా ఆయనకు స్థానం కల్పించడం లేదు.

- **మిగతా నియోజకవర్గాల్లోనూ...**

రాజానగరం నియోజకవర్గం చాలా ఏళ్ల నుంచి కమ్మ సామాజికవర్గానికి పెట్టనికోట. ఆ స్థానాన్ని కాపు సామాజికవర్గానికి చెందిన జక్కంపూడికి ఇప్పించారు. ఎమ్మెల్యేగా నెగ్గించుకున్నారు. తీరా పదవి వచ్చిన తర్వాత తన తండ్రి జక్కంపూడి రామ్మోహన్‌రావుతో తిరిగిన సీనియర్ నాయకులను రాజా పక్కన పెట్టారనే వాదన ఉంది. దీంతో ఆయన సొంత పార్టీలోని సొంత సామాజికవర్గానికి చెందిన కొందరు అసమ్మతికి తెరతీశారు. కొందరు జనసేన గూటికి వెళ్లారు. ఇప్పుడు నియోజకవర్గంలోని మూడు మండలాల్లోనూ జక్కంపూడి రాజాపై వైసీపీలో, కాపు సామాజికవర్గంలో వ్యతిరేకవర్గం నడుస్తోంది. సీతానగరం మండలంలోని ఓ ఊర్లో పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని చెబుతున్నారు. నిడదవోలు సిట్టింగ్ ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడుకు సొంత పార్టీలోని ఆయన సామాజికవర్గంలోనే వ్యతిరేకత ఉంది. తన సామాజికవర్గాన్ని పట్టించుకోలేదని, తగిన గౌరవం ఇవ్వలేదనే ఆరోపణలున్నాయి. బీసీల్లోనూ గౌడ వర్గం పూర్తిగా వ్యతిరేకిస్తోందనే విమర్శలున్నాయి. గత ఎన్నికల్లో నిడదవోలు నుంచి భరత్‌రామ్ పోటీలో ఉంటారనే ప్రచారం నడిచింది. దీంతో ఆయన సొంత సామాజిక వర్గమైన గౌడ సామాజికవర్గీయులు ఆ వైపు తిరిగారు. దీంతో వారిని సమావేశం ఏర్పాటుచేసి మరీ శ్రీనివాసనాయుడు గద్దించారు. ఇది గౌడల మనసులో పాతుకుపోయిందని అంటున్నారు. కొద్దినెలల కిందట కొందరు గౌడ సామాజికవర్గానికి చెందిన వారు నిడదవోలు నియోజకవర్గం నుంచి వచ్చి భరత్‌రామ్ కోసం పనిచేస్తుండడమే దానికి కారణమని చెబుతున్నారు. కొవ్వూరులో వైసీపీలోని అంతర్గతపోరు రచ్చకెక్కింది. కొవ్వూరులో తానేటి వనిత ఉన్న సమయంలో రెండు వర్గాలుండేవి. ఏదో తేడా కొడుతుండడంతో ఆమెను గోపాలపురం రాజకీయ బదిలీ చేశారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కొవ్వూరు తీసుకొచ్చారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదని సోమవారం జరిగిన పార్టీ సమావేశంలో తేలిపోయింది. నియోజకవర్గ సమన్వయకర్త విషయంలో కొంతకాలంగా విభేదాలు నడుస్తున్నాయి. వైసీపీ పెద్దలు అటూఇటూ మార్పులు చేసినా చివరికి మళ్లీ రాజీవ్‌కృష్ణకే చోటు కల్పించారు. దీంతో కాపు సామాజికవర్గం భగ్గుమంటోంది. తమ వర్గానికే ఆ స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి. రాజకీయాలు కొత్త అయిన ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌కి ఇవన్నీ తలనొప్పిగా మారాయి. అనపర్తిలో ముందు నుంచీ పరిస్థితి చాపకింద నీరులా ఉంది. సిట్టింగ్ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఎవరినీ కలుపుకుని వెళ్లరనే విమర్శలున్నాయి. ఇప్పటికీ నియోజకవర్గంలో తనకోసం, పార్టీకోసం పనిచేసిన వాళ్లను వదిలేసి పది మంది బంధువర్గంతో పార్టీని నడుపుతున్నారనేది బహిరంగంగానే వినిపిస్తుంటుంది. ఉదాహరణకు మల్లిడి ఆదినారాయణరెడ్డి 2014లో జడ్పీటీసీగా పోటీ చేశారు. వైసీపీ ఆవిర్భావం నుంచి ఉన్నారు. సూర్యనారాయణరెడ్డి గెలుపు కోసం కృషి చేశారు. ఆయన నెగ్గిన తర్వాత బంధువర్గాన్ని చేర్చుకొని ఆదినారాయణరెడ్డిని పక్కన పెట్టేశారు. దీంతో ఆయన ఆవేదనతో సైలెంట్ అయిపోయారు. ఆయన తమ్ముడు మల్లిడి కృష్ణారెడ్డి ఇటీవల టీడీపీలో చేరారు. అటు గోపాలపురం నియోజకవర్గంలో కూడా హోంమంత్రి తానేటి వనిత సొంత పార్టీలోని స్థానిక నేతల అసమ్మతి రాజకీయాలతో తలపడుతున్నారు.

ధ్వజపతాన్ని ఎగురవేస్తున్న దృశ్యం



నరసన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

నేడు కల్యాణోత్సవం.. రథోత్సవం



కోరుకొండ, మార్చి19: శతాబ్దాల చరిత్ర కలిగిన నవ నరసింహ క్షేత్రాల్లో ఒకటైన స్వయంభు కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలకు అంకురార్పణ జరిగింది. పాల్గుణ శుద్ధ దశమి మంగళవారం సాయంత్రం పుట్టమన్ను తీసుకు రావడంతో నరసన్న బ్రహ్మోత్స వాలకు శ్రీకారం చుట్టారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ప్రత్యేక పల్లకిలో ఆశీనులు గావించి మేళతా ళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల మధ్య పుట్టమన్ను తీసుకురావడా నికి అనువంశిక ధర్మకర్త ఎస్పీ రంగరాజభట్టర్ ఆధ్వర్యంలో శ్రీ చక్రపెరుమాళ్లను తీసుకుని దేవుని కోనేరు వద్దకు వెళ్లారు. అక్కడ పవిత్రమైన పుట్టకు శాస్త్రోక్తంగా వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం ఆగమ బ్రహ్మ పాణింగిపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో పుట్టకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పుట్ట మన్ను సేకరించారు. పుట్టమన్ను తీసుకుని తిరిగి మంగళవా యిద్యాలతో లక్ష్మీనరసింహస్వామి దిగువ దేవస్థానం ఆలయ ముఖ మండపానికి చేరుకున్నారు. అక్కడ ఈ పుట్టమన్నును 9 రకాల మట్టి మూకిడిలో వేసి నవధాన్యాలు వేసి నరసన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం స్వామి వారి ధ్వజ పతాన్ని ధ్వజ స్తంభం వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం చేశారు. అంతకు ముందు స్వామి వారికి ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఎస్పీ రంగరాజభట్టర్, లక్ష్మీనరసింహభట్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, ఎంపీటీసీ కాళ్ల వీరబాబు, వైస్ ఎంపీపీ బొరుసు నాగమణి, అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ తాడి రజనీ, మరో ట్రస్టు మెంబర్ కటకం బాబ్జి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బొండాడ చందు పాల్గొన్నారు.



కల్యాణానికి వేళాయె..

కోరుకొండ, మార్చి19: కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దివ్య దంపతులకు, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ అనంత పద్మనాభ స్వామి వారికి బుధవారం రాత్రి 9 గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఆగమ పండితులు పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో వంశపారంపర్య అర్చక స్వాములు పెదపాటి, పెద్దింటి, పెరవళి స్వీయ పర్యవేక్షణలో పాంచాద్నిక దీక్షతో శ్రీ వైఖానస ఆగమ వైష్ణవ సంప్రదాయంలో అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. వంశపారంపర్య ధర్మకర్త పరాసర భట్టర్ వంశీయులు, ఎస్పీ రంగరాజభట్టర్, అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. కోరుకొండ దిగువ దేవస్థానం ఆలయ ప్రాంగణంలో స్వామి వారి కల్యాణ వేదికపై శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం, లోక కల్యాణార్థం, భక్తజన సంరక్షణార్థం జరిపించనున్నట్లు రంగరాజభట్టర్ స్వామి తెలిపారు.భక్తులందరి స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలను కనులారా తిలకించి స్వామి వారి కృపాకటాక్షలకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

పండిత సభలు

రంగరాజస్వామివారి ఆలయ ప్రాంగణంలో విశిష్టాద్వైత పండిత సభలు ప్రారంభమవుతాయి. 5 రోజులు పాటు ఉభయ వేదాంత పండితులు ఉదయం, సాయంత్రం ఈ పండిత సభల్లో పాల్గొని భక్తులకు రామాయణ, భాగవత ఆళ్వారుల దివ్య చరిత్ర గురించి ఉపన్యాసిస్తారు. ఈ కార్యక్రమాలు పరాసర లక్ష్మీనరసింహ భట్టర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

రథోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

చారిత్రాత్మక కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణ మహోత్సవాలు సందర్భంగా కల్యాణానికి ముందు బుధవారం మధ్యాహ్నం 1.58 గంటలకు స్వామి వారి రథోత్సవం జరుగుతుంది.అంతకుముందు స్వామి వారిని పెండ్లి కుమారుడిగా, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించి పండితులు నిర్ణయించిన శుభ ముహూర్తానికి పల్లకిపై తీసుకుని వచ్చి స్వామి వారి అతిపెద్ద పురాతన రథంపై స్వామి ఆశీనులు గావిస్తారు. అనంతరం రథానికి ముందు పూజలు చేస్తారు. తదుపరి అన్నాన్ని రాశిగా పోసి గుమ్మడికాయ కొట్టి రథాన్ని ముందుకు లాగుతారు. దీంతో రథోత్సవం ప్రారంభమవుతుంది. సుమారు 4 గంటలు పాటు కోరుకొండ నాలుగు మాడ వీధుల్లో వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణల మధ్య లక్షలాది అరటిపండ్లు రథంపై వేస్తుంటే రథం ముందుకు సాగుతుంది.

సాగర తీరంలో డాల్ఫిన్ల సందడి



సర్పవరం జంక్షన్, మార్చి 19: కాకినాడ సాగర తీరంలో డాల్ఫిన్లు సందడి చేస్తున్నాయి. సముద్ర తీరానికి సమీపంలో సముద్రం పై భాగంలో ఇవి పైకి తేలియాడుతూ..గాలిలోకి ఎగురుతూ చక్కర్లు కొట్టే విన్యాసాలు సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోనే ప్రముఖ పర్యాటక ప్రదేశంగా కాకినాడ బీచ్‌కు గుర్తింపు ఉంది. కాకినాడ సాగర తీరంలో సూర్యారావుపేట, నేమాం సముద్ర తీరంలో డాల్ఫిన్లు సందడి చేస్తున్నాయి. నిత్యం సుమారు 10 నుంచి 12 డాల్ఫిన్లు సముద్ర తీరానికి వచ్చి సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. డాల్ఫిన్లు సముద్రపు నీటి, నదీ జలాల్లో నివసించే క్షీరదాలు. ఇవి చూసేందుకు ఎంతో ముద్దుగా ఆహ్లాదంగా కనిపిస్తాయి. డాల్ఫిన్లు మనుషులతో దగ్గరగా ఎంతో కలుపుగోలుగా ఉంటాయి. వీటికి మనిషి మాదిరిగా తెలివితేటలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు తమ అధ్యయనాల్లో పొందుపరిచారు. ఇవి సముద్రంలో నివసిస్తూ అనుకూలమైన వాతావరణం ఉన్న సమయంలో సముద్ర తీరానికి వచ్చి సముద్రంలో పైకి వింత వింత శబ్దాలతో అరుస్తూ ఎగురుతూ విన్యాసాలు చేస్తుంటాయి. అరుదుగా కనిపించే డాల్ఫిన్లను చూసేందుకు బీచ్‌కు సందర్శకులు తరలివస్తున్నారు. గత వారం రోజులుగా కాకినాడ బీచ్‌లో సముద్ర తీరంలో డాల్ఫిన్లు సంచరించడంతో వీటి విన్యాసాలు చూసి ఫొటోలు తీసుకుంటున్నారు. మత్స్యకారులు అయితే సముద్రంలో ఈత కొడుతూ డాల్ఫిన్ల వద్దకు వెళ్లి వాటితో విన్యాసాలు చేయడం విశేషం. చిన్నారులు, పెద్దలకు ఆహ్లాదం, వినోదం అందించి అరుదైన డాల్ఫిన్లు ఇటీవల మృతి చెందుతున్నాయని సందర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సముద్రంలో విపరీతమైన కాలుష్యం పెరిగిపోవడం, చేపల వేట కోసం మత్స్యకారులు వినియోగించే మెకనైజ్డ్, మోటారైజ్డ్ బోట్ల ఇంజన్ రెక్కల్లో పడి డాల్ఫిన్లు మృత్యువాత పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అరుదైన డాల్ఫిన్ల సంరక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం

అంతర్వేది, మార్చి 19: అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ కొంపల్లికి చెందిన కూనపరాజు సూర్యావతి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పొత్తూరి సుబ్బరాజు‌ఝాన్సీలక్ష్మి రూ.2.71 లక్షలు విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణకు అందించినట్టు దాతలు తెలిపారు. అనంతరం దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ అధికారులు అందించారు. కార్యక్రమంలో తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలపై సమీక్ష

ఆత్రేయపురం, మార్చి 19: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ కోరారు. ఆలయంలో మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో ఉత్సవాల నిర్వహణపై సమీక్షించారు. ఏప్రిల్ 18 నుంచి 24 వరకు ఉత్సవాలు జరుగుతాయని, 19న తీర్థం, కల్యాణం, రథోత్సవాలను తిలకించేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారన్నారు. ప్రభుత్వ నోటిఫైడ్ ఫెస్టివల్ కావడంతో చేపడుతున్న ఏర్పాట్లపై ఆర్డీవో శాఖల వారీగా సమీక్షించారు. తాగునీరు, పారిశుధ్యం, ఆరోగ్య సేవలతో పాటు శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు చేపట్టాల్సిన చర్యలు, ట్రాఫిక్, ట్రాన్స్‌పోర్ట్, విద్యుత్ శాఖల అధికారులతో తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. శాఖల వారీగా చేపడుతున్న చర్యలను అధికారులు వివరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో నిబంధనలకు అనుగుణంగా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. ఉప కమిషనర్ భూపతిరాజు కిశోర్‌కుమార్, దేవదాయ శాఖ జిల్లా అధికారి నాగమల్లేశ్వరరావు, డీఎల్‌డీవో రాజేశ్వరరావు, సీఐ రామ్‌కుమార్, తహసీల్దారు వెంకటరామయ్య, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, పరిపాలనాధికారి సురేంద్రరెడ్డి, వైద్యాధికారి సౌమ్య, ఆర్టీసీ డిప్యూటీ మేనేజర్ అచ్యుతాంబ పాల్గొన్నారు.

యువతిని నమ్మించి, మోసగించిన కేసులో

ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌కు ఏడేళ్ల జైలు శిక్ష

అమలాపురం రూరల్, మార్చి 19: యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించి ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చిన తర్వాత కట్నం ఆశించి పెళ్లి చేసుకోకుండా మోసం చేసిన కేసులో ముద్దాయికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం ఎనిమిదో ఏడీజే కోర్టు, క్రైమ్ ఎగెనెస్ట్ ఉమెన్స్ కోర్టు జడ్జి వై.బెన్నయ్యనాయుడు తీర్పు వెలువరించినట్లు పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ మంగళవారం తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలానికి చెందిన యువతిని వన్నెచింతలపూడికి చెందిన పరమట వెంకటేశ్వర దొరబాబు, అలియాస్ వెంకటదొరబాబు ప్రేమిస్తున్నానని వెంటపడి నమ్మించి శారీరకంగా అనుభవించాడు. కాలక్రమంలో అతడికి సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం రావడంతో కట్నం ఆశించి ఆ యువతిని మోసం చేసి మరో పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. సమాచారం తెలుసుకున్న యువతి 2019 జనవరి 17న అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు కేసు నమోదు చేయగా అనంతరం వచ్చిన సీఐ జి.సురేష్‌బాబు దర్యాప్తు చేపట్టారు. దొరబాబు సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సమయంలో అనుమతి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. రాజమహేంద్రవరం కోర్టులో వాదోపవాదాలు జరిగాయి. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు వాదనలు వినిపించగా దొరబాబుపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఎస్.శ్రీధర్ హెచ్చరించారు. ఈ కేసులో నేరం రుజువు చేయడానికి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

గండేపల్లి, మార్చి 19: కాకినాడ జిల్లా గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం పోక్సో కేసు నమోదైంది. గండేపల్లి పోలీసుల వివరాల ప్రకారం... గండేపల్లి గ్రామానికి చెందిన ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్న ఐదేళ్ల బాలికపై అదే స్కూల్‌కు ఆటోపై రోజు తీసుకెళ్తున్న డ్రైవర్ లైంగిక చర్యకు పాల్పడినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. కాకినాడ దిశా డీఎస్పీ ఆర్.రామచంద్రరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గండేపల్లి పోలీసులు తెలిపారు.

ఆటోలో తరలిస్తున్న రూ.4.50 లక్షలు సీజ్

ద్రాక్షారామ, మార్చి 19: రామచంద్రపురం మండలం నరసాపురపుపేట వద్ద మంగళవారం రాత్రి ఆటోలో తరలిస్తున్న రూ.4.50 లక్షల నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం స్వాధీనం చేసుకుంది. వాహనాల తనిఖీల్లో భాగంగా కరప వైపు నుంచి రామచంద్రపురం వస్తున్న వాహనంలో సదరు మొత్తం పట్టుబడింది. నగదును రామచంద్రపురం పోలీసులకు అప్పగించారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

పూర్వ డీసీహెచ్‌ఎస్ రమేష్‌కిషోర్‌పై విజిలెన్స్ విచారణ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 19: పూర్వ డీసీహెచ్‌ఎస్ డాక్టర్ టి.రమేష్‌కిషోర్‌పై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రమేష్‌కిషోర్ రాజమహేంద్రవరం డీసీహెచ్‌ఎస్‌గా పనిచేసిన సమయంలో హాస్పిటల్‌లో మహిళా ఉద్యోగినిలపై వేధింపులకు పాల్పడుతున్నాడని, ఆసుపత్రి ఫండ్స్‌లో అవకతవకలు జరిగాయని గతంలో అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ తరుపున న్యాయవాదులు గొట్టిముక్కల అనంతరావు, ధర్నాలకోట వెంకటేశ్వరావు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణాధికారిగా విజయనగరం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బి.గౌరిశంకరరావును నియమించింది. ఈ మేరకు బుధవారం కొవ్వూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో విచారణ నిర్వహించనున్నట్టు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సనత్‌కుమారి పేర్కొన్నారు.

కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థిగా తంగెళ్ల ఉదయ్

- మంగళగిరిలో పార్టీ నేతల సమావేశంలో ప్రకటించిన పవన్
- ఎంపీ అభ్యర్థి ఎవరనేదానిపై సస్పెన్స్‌కు తెర
- స్వయంగా పవన్ బరిలోకి దిగవచ్చని కొంతకాలంగా బలంగా ప్రచారం
- పవన్ పిఠాపురం వైపు మొగ్గుచూపడంతో బరిలోకి దిగే నేతపై ఉత్కంఠ
- ఎట్టకేలకు తంగెళ్ల వైపు మొగ్గు..సానాకు దక్కని చాన్స్



పవన్‌కల్యాణ్, నాగబాబుతో ఉదయ్‌శ్రీనివాస్

(ఆంధ్రజ్యోతి, కాకినాడ): ఎట్టకేలకు సస్పెన్స్ వీడింది. కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి ఎవరనే దానిపై కొంతకాలంగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, టీ టైం అధినేత తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌ను ఎంపీ అభ్యర్థిగా పవన్ మంగళవారం ప్రకటించారు. వాస్తవానికి కాకినాడ ఎంపీ సీటు నుంచి టీడీపీ అభ్యర్థి బరిలోకి దిగుతారని తొలుత చర్చ జరిగింది. కానీ పొత్తు నేపథ్యంలో టికెట్‌ను జనసేన దక్కించుకుంది. దీంతో పలువురు పోటీకి సిద్ధమైనా అసలు అభ్యర్థి ఎవరనేదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. స్వయంగా పవన్ బరిలోకి దిగుతారంటూ కొంతకాలం విస్తృతంగా చర్చ నడిచింది. కానీ తాను పిఠాపురం నుంచి పోటీ చేస్తానని పవన్ ఇటీవల ప్రకటించడంతో కొంత గందరగోళానికి తెరపడింది. పిఠాపురం నుంచి టికెట్ ఆశించిన నియోజకవర్గ ఇంచార్జి తంగెళ్లకు ఎంపీ అభ్యర్థిగా పవన్ చాన్సిచ్చారు. కాగా ఈ సీటును సానా సతీష్ ఆశించారు. కానీ పవన్ మాత్రం తంగెళ్లవైపే మొగ్గు చూపారు.

అక్కడ లేదని..ఇక్కడ చాన్స్

కాకినాడ ఎంపీ స్థానం నుంచి తమ పార్టీ తరఫున అభ్యర్థిని సిద్ధం చేసిన టీడీపీ, తీరా జనసేనతో పొత్తు కుదరడంతో కాకినాడ సీటు వదులుకుంది. దీంతో కాకినాడ ఎంపీ అభ్యర్థిగా ఎవరిని బరిలోకి దించుతారనేదానిపై పెద్ద చర్చ జరిగింది. ఉమ్మడి తూ.గో. జిల్లాలో కాకినాడ పార్లమెంట్ పరిధిలో తమ పార్టీకి బలం ఎక్కువగా ఉందని, సామాజిక సమీకరణాల కోణంలోను ఇక్కడి నుంచి ఎంపీ అభ్యర్థిని ఎవరిని నిలబెట్టినా విజయం సాధిస్తామనే అంచనాలు జనసేనలో నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో పొత్తులో భాగంగా ఏరి కోరి కాకినాడ ఎంపీ సీటును జనసేన ఖాయం చేసుకుంది. దాదాపు అన్ని స్థానాల్లో టీడీపీ కూటమి అభ్యర్థులపై స్పష్టత వచ్చినా కాకినాడ ఎంపీ అభ్యర్థి ఎవరనేదానిపై చాలా కాలంగా స్పష్టత లేకుండా పోయింది. బీజేపీతో పొత్తు కుదిరిన నేపథ్యంలో ఆ పార్టీ ఒత్తిడి మేరకు పవన్ ఎంపీగా బరిలోకి దిగవచ్చని ప్రచారం జరిగింది. అదే సమయంలో పిఠాపురం సీటును కూడా పొత్తులో భాగంగా దక్కించుకున్న జనసేన ఇక్కడ కూడా అభ్యర్థి ఎవరనేదానిపై తేల్చలేదు. దీంతో కాకినాడ ఎంపీ, పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థులు ఎవరనేదానిపై సస్పెన్స్ నెలకొంది. ఈరెండు స్థానాల్లో పవన్ బరిలోకి దిగొచ్చనే అంచనాలు నెలకొన్నాయి. మరోపక్క పిఠాపురం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న తంగెళ్ల శ్రీనివాస్ తాను ఇక్కడి నుంచి బరిలో ఉంటానని గతంలో పవన్‌కు స్పష్టత ఇచ్చారు. దీంతో పిఠాపురం నుంచి తంగెళ్ల, ఎంపీ అభ్యర్థిగా పవన్ బరిలో ఉండొచ్చనే విశ్లేషణలు జనసేనలో కొనసాగాయి. కానీ ఇటీవల అనూహ్యంగా పవన్ తాను పిఠాపురం నుంచి బరిలో ఉంటానని స్వయంగా ప్రకటించారు. దీంతో ఈ స్థానం ఆశిస్తోన్న తంగెళ్లకు చాన్స్ లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో మంగళవారం తంగెళ్లను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. దీంతో కొంతకాలంగా కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరపడ్డట్లయింది. కాగా ఎంపీ అభ్యర్థిగా పవన్ ప్రకటించిన ఉదయ శ్రీనివాస్ కడియం ప్రాంతానికి చెందిన నేత. టీ టైం అధినేతగా ఉంటూ గతేడాది జనసేనలో చేరారు. పవన్‌కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గంలో వారాహి యాత్ర నిర్వహించిన అనంతరం తంగెళ్లను ఇన్‌చార్జిగా నియమించారు. కాగా మంగళవారం మంగళగిరిలో పిఠాపురం నియోజకవర్గం నుంచి వివిధ పార్టీల నాయకులు పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా పవన్ తంగెళ్లను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. తాను బరిలో ఉండాల్సిందేనని, కానీ ఎందుకు పిఠాపురం వెళ్లాల్సి వచ్చిందనేదానిపైనా పవన్ స్పష్టత ఇచ్చారు. బీజేపీ కేంద్ర నాయకత్వం తనను ఎంపీగా పోటీ చేస్తావా, ఎమ్మెల్యేగా వెళ్లతావా అని అడిగారని ఎమ్మెల్యేగా పోటీ చేసి అసెంబ్లీలో అడుగుపెడతానని చెప్పానని, ముందు రాష్ట్రానికి తర్వాత దేశానికి సేవ చేయాలని ఉందని వివరించానంటూ తన అంతరంగాన్ని ప్రకటించారు.

ఇక ఎన్నికల రణమే..

కాకినాడ ఎంపీ అభ్యర్థిగా టీడీపీ తరఫున బరిలోకి దిగడానికి గతేడాది నుంచి కాకినాడకు చెందిన వ్యాపారవేత్త సానా సతీష్ ప్రయత్నాలు చేశారు. లోకేశ్ యువగళం పాదయాత్ర, చంద్రబాబు రా.. కదలిరా సభల్లోను ఆయన అన్నివిధాలా ముందుండి పనులు చక్కబెట్టారు. కానీ కాకినాడ ఎంపీ సీటును పొత్తులో భాగంగా జనసేనకు ఇవ్వాల్సి రావడంతో సతీష్ రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. టికెట్ జనసేనకు వెళ్లినా అభ్యర్థిని మాత్రం తానే అవుతానని సానా ఇంతకాలం భావించారు. కొంతకాలం కిందట పవన్‌ను కలిసి తన మనసులో మాట చెప్పారు. త్వరలో తన పేరు కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి లిస్ట్‌లో ఉంటుందని భావించారు. కానీ సీటు తంగెళ్లను వరించింది. కాకినాడ పార్లమెంటు పరిధిలో కాకినాడ అసెంబ్లీ మినహా మిగిలిన ఆరు స్థానాల్లో తెలుగుదేశం, జనసేన పార్టీ అభ్యర్థులపై ఇప్పటికే స్పష్టత రావడంతో ఇక కదనరంగంలోకి ఇరుపార్టీల నేతలు వెళ్లనున్నారు. ఇప్పటికే తుని, జగ్గంపేట, పెద్దాపురం, ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థులు యనమల దివ్య, జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, వరుపుల సత్యప్రభలు, కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి పంతం నానాజీ విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివిధ పార్టీల నుంచి భారీ చేరికలతో పాటు ప్రజలకు వద్దకు వెళ్లి మద్దతు కూడగట్టడంలో నిమగ్నమయ్యారు. పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేయనుండడంతో ఆ ప్రభావం ఏడు నియోజకవర్గాలపై ఉంటుందని భావిస్తున్నారు.

స్కూల్ బస్సు ఢీకొని అంగన్‌వాడీ చిన్నారి మృతి

దివాన్‌చెరువు, మార్చి 19 : రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలచర్ల గ్రామంలో ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొని అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న బండి శ్రీవల్లి(4) అనే చిన్నారి మృతి చెందింది. మంగళవారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారి మధ్యాహ్నం భోజన సమయంలో మరో ఇద్దరు చిన్నారులతో కలసి ఆయా సహాయంతో మూత్ర విసర్జనకు బయటకు వచ్చింది. బాలిక వెంట వచ్చిన ఇద్దరు చిన్నారులు ముందుగా మూత్ర విసర్జన అనంతరం కేంద్రానికి బయలుదేరి వెళ్లడంతో వారికోసం ఆయా చిన్నారి శ్రీవల్లీని వదిలి ముందుకు వెళ్లింది. ఈ నేపథ్యంలో అటుగా అతివేగంగా వస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్ శ్రీవల్లీని ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన బాలికను చికిత్స నిమిత్తం రాజమండ్రిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈమేరకు ఎస్‌ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల భారంతో ఉరేసుకుని ఆత్మహత్య

రాజానగరం, మార్చి 19 : అప్పుల భారంతో మండలంలో నరేంద్రపురం గ్రామానికి చెందిన మద్దూరి శ్రీను(47) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన శ్రీను గతంలో ఫ్రూట్స్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఫైనాన్స్ ద్వారా వరికోత యంత్రాన్ని కొనుగోలు చేశాడు. దీనికితోడు ఇంటి నిర్మాణం, కుమార్తె వివాహం చేసి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో అప్పుల భారం అధికం కావడం, తీర్చే మార్గం లేకపోవడంతో కొంతకాలంగా కూలి పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు. కుమార్తె నిండు గర్భిణి కాగా కుమారుడు తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. దీంతో మనస్తాపం చెందిన శ్రీను చేసేది లేక మంగళవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనా స్థలాన్ని రాజానగరం పోలీసులు పరిశీలించి, పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజానగరం సీఐ పి.కాశీవిశ్వనాథ్ తెలిపారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

రూ.5.07 లక్షల విలువైన పెట్రోల్, డీజిల్ స్వాధీనం



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

అమలాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి)/రాయవరం: విజిలెన్స్ అధికారులు మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం సోమేశ్వరం గ్రామంలోని శ్రీవీరవెంకట సత్యనారాయణ సామిల్ అండ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులో తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. నయారా ఎనర్జీ లిమిటెడ్ ఫ్రాంచైజ్ వారితో ఒప్పందాన్ని రద్దు చేసుకున్న తర్వాత కూడా అదే పేరుతో డీలర్ స్టాకును విక్రయిస్తున్నాడు. అంతే కాకుండా నయారా ఎనర్జీ లిమిటెడ్ ఫ్రాంచైజ్ రద్దు విషయం జాయింట్ కలెక్టర్ దృష్టికి కూడా తీసుకురాలేదు. పెట్రోల్ బంకులోని ఎయిర్ మిషన్ పనిచేయట్లేదు. అగ్నిమాపక యంత్రాలు రీఫిల్ చేయలేదు. సివిల్ సప్లయ్సు అధికారులు ఆ బంకు నుంచి రెండు నమూనాలను విశ్లేషణ నిమిత్తం సేకరించారు. ఒప్పందం రద్దు చేసుకున్న తర్వాత కూడా డీలర్ స్టాకును విక్రయిస్తున్న కారణంగా, స్టాకు రిజిస్టర్ నిర్వహించకపోవడంతో రాయవరం సివిల్ సప్లయిస్ అధికారులు రూ.5,07,715 విలువ గల 3158 లీటర్ల పెట్రోలు, 1686 లీటర్ల డీజిల్ స్టాకును స్వాధీనం చేసుకుని బంకు యాజమాన్యంపై 6(ఎ) కేసు నమోదు చేసినట్టు విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్వీ సుబ్బారెడ్డి మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. పెట్రోలు బంకుల యజమానులు అనుమతులు లేకుండా అమ్మకాలు జరిపినా, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ముత్యాలనాయుడు, నాగవెంకటరాజు, విజయ్‌కుమార్, అలీషా పాల్గొన్నారు.

వైసీపీ నాయకులపై కేసు నమోదు

ద్రాక్షారామ, మార్చి 19: రామచంద్రపురం మండలం వెలంపాలెంలో ఎన్నికల నియమావళి ఉల్లంఘించి గ్రామ సచివాలయంలో సమావేశం జరపడంపై ఎంపీడీవో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. వెలంపాలెం సర్పంచ్ భర్త టేకుమూడి సత్యనారాయణ మరో 9 మంది వైసీపీ నాయకులు గ్రామ సచివాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు సమావేశమయ్యారు. వెలంపాలెం ఎంసీసీ సభ్యులు వీఆర్‌వో, పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీసులు ఎన్నికల నియమావళి అమలులో ఉన్నదని చెప్పినప్పటికీ సమావేశం కొనసాగించారు. దీనిపై ఎంసీసీ సభ్యులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేయగా ఎంపీడీవో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ద్రాక్షారామ ఇన్‌చార్జి ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఏజెన్సీ సమాచారం

ఎన్నికలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలి: పీవో

రంపచోడవరం, మార్చి 19: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు పూర్తిస్థాయిలో చేయాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం పీవో చాంబరులో ఆయన సబ్ కలెక్టరు, రిటర్నింగ్ అధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్, చింతూరు ఐటీడీఏ పీవో చైతన్యలతో కలిసి వివిధశాఖల అధికారులతో ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌ల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. పీవో మాట్లాడుతూ 399 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలు స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన నివేదికలు ఎప్పటికప్పుడు సమర్పించాలన్నారు. రూట్ మ్యాప్‌ల ప్రకారం డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, తహశీల్దారు ఎ.కృష్ణజ్యోతి పాల్గొన్నారు.

శిరీషకు వద్దన్నాం కానీ వంతలకు ఇమ్మనలేదు

● రంప టీడీపీ టికెట్ పంచాయతీలో కొత్త మలుపు


సమావేశంలో మాట్లాడుతున్న శీతంశెట్టి, గొర్లె సునీత

రంపచోడవరం, మార్చి 19: రంపచోడవరం దేశం టికెట్ పంచాయతీ మంగళవారం కొత్త మలుపు తీసుకుంది. తాము మిరియాల శిరీషకు టికెట్ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామని, అంతమాత్రాన వంతల రాజేశ్వరికి ఇవ్వమని అడగడం కాదని మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, మహిళా నాయకురాలు గొర్లె సునీత మీడియా సమావేశంలో తెలిపారు. వంతల రాజేశ్వరికి మద్దతుగా తాము చంద్రబాబు నాయుడు దగ్గరకు వెళ్లలేదని చెప్పారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వెన్నంటి ఉన్న క్యాడర్ మనోభావాలను దెబ్బతీయకుండా, నిజమైన సర్వేల ద్వారా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని గుర్తించాలని కోరామని చెప్పారు.

టీడీపీలోకి వైసీపీ కుటుంబాలు


టీడీపీలో చేరిన వైసీపీ కుటుంభాలను ఆహ్వానిస్తున్న చిన్నారెడ్డి

చింతూరు, మార్చి 19 : వైసీపీకి చెందిన పలు కుటుంబాలు మంగళవారం టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు ఇల్ల చిన్నారెడ్డి మాట్లాడారు. తమ గ్రామంలో ఐదేళ్లుగా ఎటువంటి అభివృద్ధి జరగలేదని టీడీపీ కూటమికే అభివృద్ధి సాధ్యమన్న అభిప్రాయంతో చట్టిలోని యాదవ వర్గానికి చెందిన 21 కుటుంబాలు టీడీపీలో చేరాయన్నారు. దీంతో వారందరిని పార్టీ కండువా వేసి ఆహ్వానించినట్లు చెప్పారు. ఎస్టీసెల్ అధ్యక్షుడు తుర్రం చిన్న ముత్తయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు ఆకోజు నూకాచారి, యువజన సంఘం అధ్యక్షుడు గద్దం సురేష్‌కుమార్, నాయకులు సాల్మన్‌రాజు, రామారావు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్

కూనవరం, మార్చి 19: మాజీ ముఖ్యమంత్రి టీడీపీ జాతీయ నాయకుడు చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం సంక్షేమంలో ముందడుగు వేస్తుందని తెలుగుదేశం అరకు పార్లమెంట్ ప్రతినిధి ఎడవల్లి భాస్కరరావు అన్నారు. టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమర్థవంతమైన అభ్యర్థులను రంపచోడవరం నియోజకవర్గంలో నిలబెట్టాలన్నారు. మరోసారి వంతలరాజేశ్వరి పేరును పరిశీలించాల్సిందిగా చంద్రబాబును కార్యకర్తలు కోరారు. కార్యక్రమంలో పొడియం అప్పారావు, ప్రేమ్‌చంద్, ఎస్‌కె రసూల్, బట్టు భాస్కరరావు, మడకం చిన్ని, ముత్తయ్య పాల్గొన్నారు.

సికిల్‌సెల్ వ్యాధి నివారణ అవగాహన సదస్సు

దేవీపట్నం, మార్చి 19: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ముర్తజవలి ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బందికి హెల్త్ ఎడ్యుకేటర్ పి.ఝాన్సీరాణి సికిల్‌సెల్ వ్యాధి నివారణపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజన గ్రామాల్లో 40 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన వారు సికిల్‌సెల్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని టెస్టులు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వెంకటేశ్వరరావు, హెచ్‌వీ నీరజ, వరలక్ష్మి, ఎంఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ శిక్షణ తరగతులు

మోతుగూడెం, మార్చి19: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయిలో మన డీసీపీహెచ్ఓఎం స్టాఫ్, సివిల్ స్టాఫ్‌కు ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్, కార్పొరేషన్ 19,20న రెండు రోజులు రైతు భరోసా కేంద్రంలో శిక్షణ తరగుతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జ్ డీఈ వరప్రసాద్, డొంకరాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.విజయ్‌కుమార్, పవర్ హౌస్ ఎంవో స్టాఫ్, సివిల్ స్టాఫ్ హాజరయ్యారు.

మాస్ కాపీయింగ్‌కు తావివ్వొద్దు

మోతుగూడెం, మార్చి19: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. డొంకరాయి జిల్లా పరిషత్ పాఠశాలలో 12 మంది విద్యార్థులు, ఆశ్రమ గర్ల్స్ హైస్కూల్లో 26మంది, ఆశ్రమ హై స్కూల్ మంగంపాడులో పది మంది మొత్తం 48 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. పరీక్షా కేంద్రాన్ని డొంకరాయి ఎస్ఐ శివకుమార్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపరీక్షలలో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు తావివ్వద్దు అన్నారు.

హక్కుల అమలు కోసమే పోటీలోకి: కుంజా శ్రీను


కార్యక్రమంలో పాల్గొన్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

రంపచోడవరం, మార్చి 19: ఆదివాసీ హక్కుల అమలు కోసమే ఎన్నికల్లో ఆదివాసీ సంక్షేమ పరిషత్ అభ్యర్థులు పోటీ చేస్తున్నట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల తరపున అసెంబ్లీలో ప్రశ్నించే గొంతు లేకపోవడం వల్లనే ఆదివాసీ సంక్షేమ పరిషత్ పోటీకి సిద్ధమయ్యిందన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలలో ఎన్నికైన ఎస్టీ ఎమ్మెల్యేలు కేవలం రబ్బరు స్టాంపులే అన్న విషయం ఆదివాసీలు గుర్తించాలన్నారు. జీవో నెంబరు 3ని ఎందుకు రద్దు చేశారో ప్రశ్నించాలన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు తీగల బాబూరావు, చవలం రాంబాబుదొర, పూసం బాలుదొర, బొరగ ఎర్రమ్మ, పీట ప్రసాద్, మోడిద నూకరాజు, చోడి ఏడుకొండలు, సుర్ల సత్యనారాయణ, కురసం వరలక్ష్మి, కండా కరుణ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నికల కోసం అవగాహన సమావేశం

మోతుగూడెం, మార్చి19: ఎస్పీ తుహిన్‌సిన్హా, రంపచోడవరం ఓఎస్టీ కేవీ మహేశ్వర రెడ్డి, చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్ మీనా, చింతూరు సీఐ గజేంద్రకుమార్ ఆదేశాలతో బొడ్డగండి గ్రామ పంచాయతీ పరిధిలో తెలుగు క్యాంప్ గ్రామస్థులతో డొంకరాయి ఎస్ఐ శివకుమార్ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ వచ్చే సాధారణ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును పూర్తి స్వేచ్ఛతో వినియోగించుకోవాలని డొంకరాయి ఎస్ఐ కోరారు. అనంతరం పిల్లలకు స్వీట్లు పంపిణీ చేసి యువతకు వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కల్యాణ్, కానిస్టేబుల్ పోసయ్య పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో మానవాళికి మేలు

దివాన్‌చెరువు, మార్చి 19: పర్యావరణ పరిరక్షణతో మాన వాళికి ఎంతో మేలు జరుగుతుందని గైట్ అటానమస్ కళాశాల ఎన్.ఎస్.ఎస్.వలంటీర్లు అన్నారు. గైట్ ఎన్.ఎస్.ఎస్.విభాగం ఆధ్వర్యంలో స్థానిక ధరణిగోదావరి విద్యాపీఠంలో మంగళవారం పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గైట్ కళాశాల ఎన్.ఎస్.ఎస్.పిఓ వై.డి.శివప్రసాద్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం

రాజానగరం, మార్చి 19 : గైట్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. జాతీయ రహదారి వెంబడి వ్యభిచారం సాగిస్తున్న వారికి ఎయిడ్స్‌పై నిర్మూలన, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి విటులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పీఎంఎంఎస్ శర్మ విద్యార్థులను అభినందించారు.

రెడ్డిపంతుల సత్రంలో భక్తులకు నిత్యాన్నదానం

కోరుకొండ, మార్చి19: శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దివ్యకల్యాణ మహోత్సవాలను తిలకించడానికి వచ్చే లక్షలాదిమంది భక్తులకు మిరియాల వెంకటరెడ్డి పంతులు సత్రంలో ఉదయం, సాయంత్రం, అన్నప్రసాదాలు అందజేయనున్నట్లు సత్రం ఈవో పాటి సత్యనారాయణ తెలిపారు. దాత మిరియాల వెంకటరెడ్డి పంతులు కల్యాణ మహోత్సవాలను తిలకించడానికి వచ్చే భక్తులకు 5రోజులపాటు అన్నప్రసాదాలు అందించడం కోసం 160 ఎకరాలభూమిని కోరుకొండ నడిబొడ్డున ఒక ధర్మసత్రాన్ని దానంగా రాసి ఇచ్చారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు నరసన్న భక్తులకు ప్రతి సంవత్సరం అన్నదానం నిర్వహిస్తున్నారు.

విజయవంతమైన ప్రజాగళం సభ

● వైసీపీకీ ఓటమి ఖరారు
● రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల



రాజమహేంద్రవరం రూరల్, మార్చి 19: దేశ ప్రధాని నరేంద్ర మోదీ హాజరైన చిలకలూరిపేట ప్రజాగళంసభ చరిత్రలో నిలిచేలా విజయవంతమైందని టీడీపీ, జనసేన, బీజేపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాగళం సభలో పోలీసుల ఘోరవైఫల్యం అడుగడుగునా కనిపించిందన్నారు. పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. సభాభద్రత నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు ఉన్నతాధికారులపై చీఫ్ ఎలక్షన్ కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. లక్షలాదిమంది జనం తోసుకు వస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూడటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. టీడీపీ-జనసేన-బీజేపీ తొలి ఎన్డీఏ సభ విజయవంతమైందన్నారు. దీంతో అధికారపార్టీ వెన్నులో వణుకు పుట్టిందన్నారు. ట్రాఫిక్ జామ్ కావడంతో చాలామంది సభకు రాలేక పోయారని చెప్పారు. ఈ సభద్వారా ప్రధాని మోది ఒకటి స్పష్టం చేశారని ఏపీ ప్రజలు కష్టాలు తనకు తెలుసునని వచ్చే ఐదేళ్ల ఎంతో కీలకమైనవని ఏపీ ప్రజలకు అండగా ఉంటామన్నారు. సభలో క్రౌడ్ మేనేజ్‌మెంట్ బాధ్యత ఎవరిదని, అధికారులను ఎందుకు పెట్టలేదు, పోలీసులు ఎందుకు పట్టించుకోలేదు వంటి సంఘటనలపై సమగ్ర విచారణ జరపాలని చీఫ్‌ఎలక్షన్ కమిషన్‌ను కోరుతున్నామన్నారు.

ప్రజాగళం సభ భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలి : ఆదిరెడ్డి



రాజమహేంద్రవరంసిటీ: చిలకలూరిపేటలో జరిగిన ప్రజాగళం సభలో భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలని ఎన్నికల కమిషన్‌ను కోరుతున్నామని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి నిర్వహించిన ప్రజాగళం సభ లక్షలాది మంది జనంతో నిండిపోయిందని, ఇంకా లక్షలాది మంది రోడ్డుపై ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయారని చెప్పారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తుందనడానికి ప్రజాగళం సభ విజయకేతనమే నిదర్శన మన్నారు.

విచారణ చేపట్టాలి: రామకృష్ణారెడ్డి



బిక్కవోలు: ఇటీవల చిలకలూరిపేటలో దేశ ప్రధాని నరేంద్రమోదీ హాజరైన ప్రజాగళం సభకు భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు ఉన్నతాధికారులపై చీఫ్ ఎన్నికల కమీషన్ తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అనపర్తి ఎన్డీఏ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన బిక్కవోలు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లక్షలాది మంది ప్రజలు హాజరైన సభకు పోలీసులు ఇచ్చే భద్రత ఇదేనా అని ప్రశ్నించారు. సమావేశంలో దేశం నేతలు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పల్లి వాసు, గొర్రెల త్రిమూర్తులు, గుణ్ణం రమేష్‌చౌదరి, మాడా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీ కోసం శ్రమిద్దాం

టీడీపీ రాజానగరం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి


టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బీవీఆర్ చౌదరి

సీతానగరం, మార్చి 19: ఉమ్మడి అభ్యర్థి బత్తుల విజయం ఖాయమని, భారీ మెజార్టీ కోసం శ్రమించాలని టీడీపీ రాజానగరం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం రఘుదేవపురంలోని సాయిబాబా కళ్యాణమండపంలో కూటమి పార్టీ ఆత్మీసమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం రాజానగరం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు ఈ సందర్భంగా బీవీఆర్ చౌదరి మాట్లాడుతూ అతి విశ్వాసానికి పోకుండా గ్రామస్థాయి నుంచి ఓటర్లను కలిసి ఓటింగ్ శాతం పెంచాలని, బత్తుల బలరామకృష్ణకు అఖండ మెజార్టీ తీసుకురా వాలని సూచించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ వైసీపీ నాయకులు చీప్ ట్రిక్స్ ప్లేచేస్తున్నారని అందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కాండ్రు శ్రీనివాసరావు, లక్కిశెట్టి శ్రీనివాసరావు, కాండ్రు శేఖర్, కాండ్రేగుల పోశిరత్నం,మద్దాల ఏసుపాదం, కూచిపూడి కోటేశ్వరరావు, గెడ్డం కృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభివృద్ధిపై స్పష్టత ఇవ్వాలి :రామకృష్ణారెడ్డి

అనపర్తి, మార్చి 19: అనపర్తి నియోజకవర్గ అభివృద్ధి ప్రధాతగా చెప్పుకుంటూ వీధి వీధిన ఆర్చిలు ఏర్పాటు చేసు కున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధిపై స్పష్టత ఇవ్వాలని ఎన్డీఏ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం రామవరం లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంతో తాను చేసిన అభివృద్ధి మినహా ఆయన చేసింది లేదన్నారు. తన హయాంలో మంజూరు చేయించిన నిధులను రద్దు చేయించిన ఎమ్మెల్యే ఆ పనులను నిలుపుదల చేశారని అన్నారు. సామర్లకోట కెనాల్ రోడ్డు అభివృద్ధికి తన హయాంలో తొమ్మిది కోట్ల నిధులు మరమ్మతులకు మంజూరు చేయిస్తే ఆయన హయాంలో తొమ్మిది లక్షలు కూడా మంజూరు చేయించలేక సొంత నిధులతో మరమ్మతులంటూ ప్రచారం చేసుకు న్నారని అన్నారు. నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలపై 185 అక్రమ కేసులు బనాయించారని, తనపై 39 కేసులు బనాయించి జైలుకు పంపారని అన్నారు. టీడీపీ నాయకులు కర్రి వెంకటరామారెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, పేరిశెట్టి లాలయ్య పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే మహిళాభివృద్ధి సాధ్యం : మహాలక్ష్మి

చంద్రబాబుతోనే మహిళాభివృద్ధి సాధ్యమని ఎన్డీఏ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సతీమణి మహాలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె అనపర్తి మండలం లక్ష్మీనరసాపురంలో మహా శక్తి పథకాల ద్వారా మహిళలకు జరిగే లబ్ధిని వివరిస్తూ ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళానేతలు సిరసపల్లి లక్ష్మి, కర్రి శేషారత్నం, మల్లిడి శ్రీనివాసరెడ్డి, శ్రీనురాజు, టీడీపీ, జనసేన కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఆరికరేవులలో మనోజ్‌రెడ్డి ప్రచారం

బిక్కవోలు: అనపర్తి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని గెలిపించాలంటూ యువనేత నల్లమిల్లి మనోజ్‌రెడ్డి మంగళవారం ఆరికరేవుల గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈయన వెంట టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి విజయం ప్రజల భవిష్యత్తుకు శ్రేయస్కరం

● భవిష్యత్తుకు గ్యారెంటీలో ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్యే భవాని

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 19: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయంతోనే ప్రజలందరి భవిష్యత్తుకు శ్రేయస్కరమని రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని అన్నారు. రాజమహేంద్రవరం 40వ డివిజన్‌లో ఆదిరెడ్డి వాసు, 46వ డివిజన్‌లో ఆదిరెడ్డి భవాని పర్యటించి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆగురు ధనరాజ్, మొకమాటి సత్యనారాయణ, తురకల నిర్మల, పిడిమి ప్రకాష్, మండల రవి, లక్ష్మణరావు, మురళీ, బూరా రమణ, కల్పన పాల్గొన్నారు.


భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని

వాసుపై బురదజల్లేందుకు భరత్ కుట్ర

● గంజాయి కేసులో పట్టుబడ్డ చోటు ఎంపీ అనుచరుడే
● తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవివరప్రసాద్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 19: టీడీపీ-జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్‌పై ఎంపీ మార్గాని భరత్‌రామ్ కుట్రచేసి బురదజల్లే ప్రయత్నం చేశారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవి వరప్రసాద్ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భరత్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే వాసుపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాజమహేంద్రవరంలో బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయి బ్యాచ్‌లను పెంచిపోషిస్తున్న భరత్ ఆ బురదను వాసుకు అంటించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. టీడీపీ అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్ మాట్లాడుతూ చోటు అనే వ్యక్తి భరత్ అనుచరుడని, అతడికి హైదరాబాద్‌లో ప్రియురాలు వుందని, ఆమె అన్నను గంజాయి కేసులో ఇరికించి అన్నాచెల్లెలను విడగొట్టేందుకు ప్లాన్ చేసిన చోటు.. స్నేహితుడిగా ఉన్న జాకీషారాఫ్‌ను వాడుకున్నాడని, ఈ ఘటనలో చోటు ప్లాన్ తల్లకిందులై చోటు, అతడి స్నేహితులు ఇరుక్కున్నారన్నారు. అయితే తెలుగు యువతలో ఉన్న జాకీషారాఫ్‌కు ఈ కేసును లింక్ చేసి భరత్‌రామ్ కుట్రచేసి ఆదిరెడ్డిపై బురద జల్లుతున్నాడన్నారు. ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు చాపల చిన్నరాజు మాట్లాడుతూ భరత్ అనుచరులుగా ఉన్న విక్రమ్‌రెడ్డి నేరుగా గంజాయి కేసులో పట్టుబడినా, పీతా రామకృష్ణ రౌడీయిజం చేసి తమ పార్టీ మహిళా నాయకురాలినే పొడిచేస్తానని బెదిరించినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వాస్తవాలు ప్రజలకు తెలుసునని, త్వరలో గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో తెలుగు యువత నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ కందికొండ అనంత్, తాడి దుర్గాప్రసాద్, బూరా రమణ, కానేటి ప్రభుదాస్, దుత్తరపు గంగాధర్, పొట్ట ఆనంద్ పాల్గొన్నారు.

రాజమహేంద్రి అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయండి

● వైసీపీ మాజీ కార్పొరేటర్లు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 19: మూడుసార్లు మేయర్లుగా చేశామని గొప్పలు చెప్పుకుంటున్న టీడీపీ మాజీ కార్పొరేటర్లు నగరానికి చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేస్తే తామేమి చేశామో శ్వేతపత్రం విడుదల చేస్తామని వైసీపీ మాజీ కార్పొరేటర్లు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడులేని అభివృద్ధిని 2019 నుంచి ఈ ఐదేళ్లలో ఎంపీ భరత్‌రామ్ చేశారని చెప్పారు. నగరంలో సుందరీకరణ పనులు, మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మాణం, కంబాల పార్కు అభివృద్ధి, ఇళ్ల పట్టాలు పంపిణీ ఆయన చేసిందేనన్నారు. దీనిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని ప్రకటించారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్లు పోలు విజయలక్ష్మి, ప్రసాదుల హరినాథ్, వాసంశెట్టి గంగాధర్, గుత్తుల మురళీధర్, బర్రే కొండబాబు, బాపన సుధారాణి, గూడూరి రాధిక, అజ్జరపు వాసు పాల్గొన్నారు.

నేటి నుంచి సోమాలమ్మ జాతర

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 19: స్థానిక శ్యామలానగర్‌లో పాత సోమాలమ్మ జాతర ఈనెల 24నుంచి 31వ తేదీ వరకు జరుగుతుందని ఆలయ ధర్మకర్త గొర్రెల సురేష్, కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఐదురోజులు అమ్మవారు ఒక్కొక్కరోజు ఒక్కొక్క రూపంలో దర్శనమి స్తారన్నారు. ఈ సందర్భంగా పలు హోమాలు, ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని, 31న మహాన్నదానం జరుగుతుందని తెలిపారు.

సంగీత వార్షికోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 19: స్థానిక త్యాగరాజనగర్‌లో శ్రీ త్యాగరాజ నారాయణదాస సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీత వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం సాయంత్రం జె.యె. జయంత్ (చెన్నై) (ఫ్లూట్), సాయి గిరిధర్(చెన్నై)(మృదంగం), కేవీ రామకృష్ణ (తెనాలి)(ఘటం) బృందం వేణుగానం శ్రావ్యంగా ఆలపించారు. సంగీత ప్రియులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

పాకిస్థాన్ నుంచి వచ్చిన హిందువులను ఆదుకుంటాం

● రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు

గోకవరం, మార్చి 19: పాకిస్థాన్ నుంచి ప్రాణభయంతో భారతదేశానికి వలస వచ్చిన హిందువులను ఆదుకుంటామని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవసాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. గోకవరంలో మంగళవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ హిందూ ధర్మ పరి రక్షణకు రామసేన కట్టుబడి ఉందన్నారు. హిందువులకు ఏ కష్టం వచ్చినా ఆదుకోవడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నా నన్నారు. శిబిరంలో మరుగుదొడ్ల ఏర్పాటుకోసం రూ.2లక్ష లను ఆర్థిక సహాయంగా థింక్ పీస్ ఆర్గనైజేషన్ కిరణ్‌కు అందజేస్తామన్నారు.

మత్స్యకారులకు జాగాల కేటాయింపు



సమావేశంలో మాట్లాడుతున్న వెలమ లక్ష్మణరావు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 19: జాంపేట చేపల మార్కెట్‌లో జాగాల కేటాయింపులకు సంబంధించి పాత విధానాన్ని రద్దుచేసి లాటరీ పద్ధతిలో కేటాయింపులు చేసి మత్స్యకారులకు న్యాయంచేసిన జిల్లాకలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్‌లకు మార్కెట్ కమిటీ గౌరవాధ్యక్షుడు వెలమ లక్ష్మణరావు ధన్యవాదాలు తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాంపేట చేపల మార్కెట్‌లో దళారులు ఎన్నోఏళ్లుగా మత్స్యకారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. మార్కెట్‌లో జాగాల కేటాయింపులు లాటరీ పద్ధతిలో నిర్వహించాలని హైకోర్టుకు వెళ్లామని, హైకోర్టు ఆర్డర్ ప్రకారం జిల్లా కలెక్టర్, కమిషనర్.. లాటరీ విధానంలో జాగాలు కేటాయించారన్నారు. సమావేశంలో గోదావరి బెస్తా మహిళా సంఘం, గోదావరిమాత ఫిషర్‌మెన్ సంక్షేమ సంఘం, మత్స్యకార సంక్షేమ సంఘాల ప్రతినిధులు డి.ధనలక్ష్మి, కంచి ప్రభాకరరావు, వెలమ లక్ష్మి, లోని మరిడమ్మ, గొల్ల అచ్చియ్యమ్మ, లక్ష్మీశాంతి, కంచి మురళీ, కంచి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 13 మంది గైర్హాజరు

బిక్కవోలు, మార్చి 19: మండలంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో రెండో రోజైన హిందీ పరీక్షకు 13 మంది విద్యార్థులు మంగళవారం పరీక్షలకు హాజరుకాలేదని ఎంఈవో సీహెచ్ వీవీ సత్యనారాయణ తెలిపారు. మండలం మొత్తంమీద 611 మంది పరీక్షలకు హాజరుకావాల్సి వుండగా బిక్కవోలు సెంటర్‌లో ఆరుగురు, ఇళ్లపల్లిలో ముగ్గురు, పందలపాక బి సెంటర్‌లో నలుగురు పరీక్షలకు హాజరుకాలేదన్నారు.

రంగంపేట: మండలంలో గల రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో మంగళవారం రెండవ రోజు నిర్వహించిన హిందీ పరీక్షకు 603 మంది విద్యార్థులకు గాను 593 మంది విద్యార్థులు హాజరయ్యారని, 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు.

బెల్లం ఊట స్వాధీనం

సీతానగరం, మార్చి 19: 5వేల లీటర్ల బెల్లం ఊట, బెల్లం, అమోనియం, 120 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సీతానగరం ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు మంగళవారం ఆయన తెలిపిన వివరాల మేరకు సీతానగరం మండలం మిర్తిపాడు శివారులో తెల్లగడ్డ వద్ద నాటుసారా తయారుచేస్తున్న స్థావరంపై దాడిచేసి 5వేల లీటర్ల బెల్లం ఊట, అమోనియా, బెల్లం, 120లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు పరారయ్యారని తెలిపారు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

అభ్యర్థులు ఎన్నికల నియమావళి పాటించాలి

● రూరల్ తహసీల్దార్ అప్పారావు



రాజమహేంద్రవరంరూరల్, మార్చి 19: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అన్ని రాజకీయపార్టీలు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా పాటించాలని ఏఆర్వో, రూరల్ తహసీల్దార్ వైవీకే అప్పారావు తెలిపారు. అనుమతి పొందిన ప్రదర్శన బోర్డులలో ఎదుటివారి గౌరవమును బంగం కలిగించే విధంగా ప్రకటనలు చేయరాదన్నారు. అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు సంబంధిత ప్రకటనల ప్రద ర్శించుటకు, వివరాలు, చేయుస్థలం, సంఖ్య వివరాలతో, ప్రచార వాహనముల సంఖ్య వాటి రిజిస్ట్రేషన్ నంబర్ల వివరాలు, ఎన్నికల బహిరంగ ప్రచారసభల అనుమతి, తదితర వాటిపై రూరల్ నియోజకవర్గం పరిధిలో రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ నుంచి అనుమతులు పొందాలన్నారు. రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో 24గంటలు కాల్ సెంటర్ అందుబాటులో ఉంటుంద న్నారు. సమాచారం కోసమైనా 0883-2416005కు సంప్రదించాలన్నారు.

వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గోవద్దు

● తహశీల్దార్ లతీఫ్ పాషా

రంగంపేట, మార్చి 19 : గ్రామ వలంటీర్లు, గ్రామసచివాలయ సిబ్బంది ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు తప్పవని రంగంపేట తహశీల్దార్ లతీఫ్ పాషా హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలంలో రెండు బృందాలుగా ఏర్పడి ఎన్నికల కార్యకలాపాలను పరిశీలిస్తారన్నారు. ఒక టీమ్ ఎన్నిల ప్రచారం కోసం గ్రామాల్లో ఫ్లెక్సీలు, బేనర్స్ ఏర్పాటుచేస్తే వారిపై చర్యలు తీసుకుంటారని, మరొక టీమ్ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో డబ్బుగాని, మ ద్యంగాని పంపిణీ చేస్తే వాటిని సీజ్ చేస్తామన్నారు. మండలంలో ప్రజలందరూ సహకరించాలని తహశీల్దార్ లతీఫ్ పాషా కోరారు.

ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి

● జిల్లా ఈస్ట్ జోన్ డీఎస్పీ కిషోర్‌కుమార్



రంగంపేట, మార్చి 19: ఎన్నికలు శాంతియుతంగా నిర్వహిం చేందుకు పోలీసులకు సహకరించాలని తూర్పుగోదావరి జిల్లా ఈస్ట్ జోన్ డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్ ఎం.కిషోర్‌కుమార్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ వారి ఉత్తర్వుల ప్రకారం జరగబోయే ఎన్నికలలో ఎటువంటి హింసకు తావులేకుండా, శాంతి భద్రతలకు భంగం కలుగకుండా పోలీస్ వారికి సహకరించాలని అన్ని రాజకీయ పార్టీలను కోరారు. అందరూ పోలీస్ వారికి సహకరించాలని ఆయన కోరారు.

ఎన్నికల కోడ్‌కు లోబడి ఆరోగ్య సురక్ష

కడియం, మార్చి 19: ఎన్నికల కోడ్ నిబంధనలకు లోబడి రెండోదశ ఆరోగ్యసురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ తెలిపారు. ఎంఆర్‌పాలెం గ్రామ పరిధిలో చైతన్యనగర్‌వద్ద రెండోదశ ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీవో రాజ్‌మనోజ్ పరిశీలించారు. ఉద్యోగులకు ఎన్నికలకు సంబంధించి సూచనలు, సలహాలు చేశారు. డా.ఎస్.నాగసాయిమౌర్య ఆధ్వ ర్యంలో 263 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మం దులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఎం.మణిజ్యోత్న, ఏ.గౌతమ్, కే.స్నేహ, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగాల విజేతలకు ప్రశంసా పత్రాలు

రాజానగరం, మార్చి19 : జాతీయ సైన్స్‌డే సందర్భంగా ఇటీవల నిర్వహించిన ప్రయోగాల్లో తమ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులకు క్రియ సంస్థ నుంచి ప్రశంసా పత్రాలు లభించినట్లు వెలుగుబందలోని ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం అగ్నేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడు తూ ఫిబ్రవరి 28న నిర్వహించిన సైన్సు ప్రయోగాల్లో తమ విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు అందరినీ అబ్బురపర్చాయన్నారు. క్రియ సంస్థ సమకూర్చిన ప్రశంసా పత్రాలను ఎంఈవోలు, రామన్నదొర, జ్యోతి ప్రసాద్ విద్యార్థులకు అందజేశారన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు కుమార్,పవన్‌కుమార్, సుధీర్ విద్యార్థులను అభినందించారు.

ఆర్ట్స్ కళాశాలకు హన్నా సొల్యూషన్స్ ఆర్థిక సాయం


రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 19: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలకు హన్నా సొల్యూషన్స్ రూ.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేసింది. కళాశాలలో ఇంక్యుబేషన్ హబ్‌ను ఏర్పాటు చేయడానికి ఈ మేరకు సంస్థ ఛైర్మన్ రాంప్రసాద్ ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ ఇంక్యుబేషన్ సెంటర్‌లో ముఖ్యంగా విద్యార్థినినులకు సేఫ్టీన్యాప్‌కిన్స్ తయారీ, జ్యూట్ బ్యాగ్‌ల తయారీ, ఐటీ ఉద్యోగాలను పొందడానికి శిక్షణ, ఉద్యాన పంటలు, వ్యవసాయం, ఆరోగ్యం, పర్యాటకరంగం గురించి శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ రామచంద్ర తెలిపారు. సీవోడబ్ల్యువో జాతీయ అధ్యక్షురాలు శ్రీదేవి, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (బుధ) సా.6.22
సహారి (గురు) ఉ.4.48

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	37.0	24.0

వైసీపీకి 'వలంటీర్'గా..



- ఎన్నికలు సమీపించడంతో అడ్డంగా బరితెగించేస్తున్న వలంటీర్లు
- వైసీపీ నేతల ఆదేశాలతో కోడ్ ఉల్లంఘించి ఇంటింటికీ వెళ్లి ప్రచారం
- పార్టీ నేతల కార్యక్రమాల్లోనూ నేరుగా పాలుపంచుకుంటున్న వైనం
- అటు ఎన్నికల కోడ్ ఉన్నా వైసీపీ అభ్యర్థుల రహస్య సమావేశాలకు హాజరు
- అధికార పార్టీ నేతల నుంచి గిఫ్ట్‌లు, ఫోన్‌లు, నగదు, వెండి గిన్నెలు స్వీకరణ
- తమను గెలిపిస్తే ఒక్కొక్కరికి రూ.లక్ష ఇస్తామంటూ పలువురు అభ్యర్థుల ఆఫర్లు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వలంటీర్లపై భారీగా వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేకమంది వలంటీర్లు ఇంకా వైసీపీ సేవలోనే తరిస్తున్నారు. అధికారపార్టీ నేతల ప్రలోభాలకు తలొగ్గి వారి కోసం యథేచ్ఛగా పనిచేస్తున్నారు. నేరుగా వారి ప్రచార కార్యక్రమాలకు హాజరవడం దగ్గర నుంచి తమ పరిధిలో ఇంటింటికి వెళ్లి వైసీపీకి ఓటేయాలంటూ యథేచ్ఛగా అడిగేస్తున్నారు. అదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో విధులకు దూరంగా ఉండాల్సి ఉన్నా అదేం ఖాతరు చేయడం లేదు. నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు అన్ని విధాలా అండాదండా అందిస్తున్నారు. ఇదే అదనుగా ఎమ్మెల్యే అభ్యర్థులు సైతం పార్టీ కార్యకర్తలకు బదులు వీరిపైనే ఆధారపడి వారిని ఆర్థికంగా బాగా సంతృప్తిపరుస్తున్నారు. కాకినాడ జిల్లాలో అయితే పార్టీని గెలిపించుకుంటే ఎన్నికలయ్యాక ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున నగదు ఇస్తామంటూ నేరుగా ఆఫర్లు కూడా ఇస్తున్నారు. దీంతో ఇప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో ఎక్కడచూసినా వేలాదిమంది వలంటీర్లు అధికార వైసీపీ కోసం నేరుగా రంగంలోకి దిగి పనిచేస్తున్నారు. యథేచ్ఛగా కోడ్‌ను ధిక్కరిస్తున్నారు. ఈనేపథ్యంలో వీరిపై ఉమ్మడి జిల్లా నుంచి భారీగా ఈసీకి ఫిర్యాదులు కూడా వెళ్లాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా వలంటీర్ల వ్యవస్థను ప్రారంభించింది. ఒక్కో వలంటీర్‌కు గౌరవం వేతనం ఇస్తూ ప్రతి యాభై కుటుంబాలకు సంబంధించి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పర్యవేక్షణ, పింఛన్ చెల్లింపులకు వీరిని వినియోగిస్తోంది. అయితే వీరు ప్రభుత్వ ఉద్యోగులు కానందున ఇప్పుడు ఎన్నికల కోడ్ రావడంతో పక్కకు తప్పుకోవాల్సి ఉంది. ఎలాంటి ప్రభుత్వ విధులు, ఎన్నికల విధులు, అధికార పార్టీ అభ్యర్థుల కోసం ప్రచారాలు చేపట్టకూడదు. కానీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వేలాదిమంది వలంటీర్లలో సింహభాగం మంది నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల ఇళ్లకు వెళ్లి వారితో రహస్య సమావేశాల్లో పాల్గొంటున్నారు. అలాగే అభ్యర్థుల ఆదేశాలతో తమ పరిధిలో కుటుంబాల వద్దకు వెళ్లి నిబంధనలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. ఇందుకుగాను వీరికి వైసీపీ అభ్యర్థులు భారీ ఆఫర్లు ఇస్తున్నారు. ఇప్పటికే కాకినాడ జిల్లాలోని తుని, పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, జగ్గంపేట తదితర నియోజకవర్గాల్లో వలంటీర్లకు అధికార పార్టీ నేతలు ఖరీదైన సెల్‌ఫోన్లు, వాచీలు, ఇతర గిఫ్ట్‌లు అందించారు. తమను గెలిపిస్తే ఎన్నికలు అయ్యాక రూ.లక్ష చొప్పున ఇస్తామంటూ ఆఫర్లు ఇచ్చారు. దీంతో ఎక్కడికక్కడ వలంటీర్లు యథేచ్ఛగా బరితెగించేస్తున్నారు. అభ్యర్థులు, వారి అనుచరులు నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారాలు, సమావేశాలకు నేరుగా హాజరవుతున్నారు. ఇంటింటికి వెళ్లి వైసీపీకి ఓటేయాలంటూ ప్రజలపై ప్రలోభాల వల విసురుతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ వలంటీర్ల తీరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్న వీరిపై చర్యలు తీసుకోవాలంటూ ఇప్పటికే ప్రతిపక్షాలు ఎన్నికల కమిషన్‌కు వందల్లో ఫిర్యాదులు పంపాయి. ఇప్పటికే తునిలో వలంటీర్ల తీరుపై ఈసీకి ఫిర్యాదులు వెళ్లడంతో చర్యలకు రంగం సిద్ధమవుతోంది.

16 మంది వలంటీర్లపై వేటు

'సిద్ధం' కార్యక్రమాలకు తామూ సిద్ధమంటూ అత్యుత్సాహం ప్రదర్శించిన వలంటీర్లపై వేటు పడింది. ఎన్నికల కమిషన్ నిబంధనలు బేఖాతరు చేసిన వారిని పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాలతో అంబాజీపేట ఇన్‌చార్జి ఎంపీడీవో కె.వరలక్ష్మి సస్పెండ్ చేశారు. అంబాజీపేట మండలం మొసలపల్లి, ఇరుసుమండల్లో 'సిద్ధం' పేరిట వైసీపీ నాయకులు సోమవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయా గ్రామాలకు చెందిన 16 మంది వలంటీర్లు పాల్గొన్నారు. మొసలపల్లిలో కొందరు వలంటీర్లు సీఎం జగన్ జై అంటూ నినాదాలు కూడా చేశారు. వైసీపీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరుతూ ఓటర్ల జాబితాతో ఉన్న 'సిద్ధం' బ్యాగ్‌లను ముఖ్య నేతలు బూత్ కన్వీనర్లకు అందించారు. ఈ ఉదంతంపై మంగళవారం ఆంధ్రజ్యోతి కోనసీమ జిల్లా మెయిన్‌లో వచ్చిన వార్తకు అధికారులు స్పందించి సస్పెండ్ చేయడంతోపాటు ఎందుకు పాల్గొన్నారో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని వలంటీర్లకు నోటీసులు ఇచ్చారు. - అంబాజీపేట

జగన్ కటౌట్‌పై మాజీ ఎన్నికల కమిషనర్ ఫిర్యాదు



రాష్ట్రంలో ఎన్నికల నియమావళిని అపహాస్యం చేస్తున్నారంటున్నారు రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనరు, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌కుమార్. మంగళవారం ఉదయం రాజమహేంద్రవరం నుంచి పశ్చిమగోదావరి జిల్లా తణుకు కారులో వెళ్తున్న ఆయన్ను ఆలమూరు మండలం జొన్నాడ జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద ఆపి తనిఖీ చేశారు. ఈ సమయంలో ఆయనకు సీఎం జగన్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కటౌట్ ఉన్న పెద్ద హోర్డింగ్ కనిపించింది. మధ్యాహ్నం తిరిగి వెళుతుండగా ఆయన జొన్నాడ వద్ద ఆగి ఆ హోర్డింగ్‌ను మీడియాకు చూపించారు. విషయం తెలుసుకున్న అధికారులు స్పందించి సాయంత్రం హోర్డింగును తొలగించారు. - ఆలమూరు

వైసీపీ సమావేశాలకు హాజరవుతున్న వలంటీర్లు

- ఎలక్షన్ కమిషన్ ఆంక్షలు బేఖాతర్
- రాజమహేంద్రవరం సిటీలో వైసీపీ సమావేశాలకు హాజరవడంపై అర్బన్ ఆర్వో దినేష్‌కుమార్ ఆగ్రహం
- హెచ్చరికలతో సరిపెట్టడంపై విమర్శలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వలంటీర్లు బరితెగిస్తున్నారు. ఎన్నికల సమయంలో వలంటీర్లను వాడుకోవద్దని ఎన్నికల కమిషన్ హెచ్చరించినా పట్టించుకోవడం లేదు. అధికార వైసీపీ నేతల ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లొంగి వైసీపీ మీటింగ్‌లకు హాజరవుతున్నారు. అంతేకాక వైసీపీ అభ్యర్థులు కూడా వలంటీర్లతో ఇంటింట ప్రచారం చేయించడానికి, ప్రతీ లబ్ధిదారుడికి రూ.లక్షల్లో లబ్ధి చేకూరినట్టు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేయించడానికి సన్నద్ధం చేశారు. గతంలో జీతం పెంచమని అడిగితే, సుమారు 100మందికిపైగా వలంటీర్లను సస్పెండ్ చేసిన అధికారులు, వారిలో మళ్లీ కొంతమందిని విధుల్లోకి తీసుకున్నారు. ఇటీవల వైసీపీ నేతలు నియోజకవర్గాల వారీ గిఫ్ట్‌లు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. ఇంకా ఎన్నికలు దగ్గరకు వచ్చే సమయంలో డబ్బు కూడా ఇస్తామని ప్రలోభాలు పెట్టి వాళ్ల చేత పనిచేయించుకునే పనిలో ఉన్నారు. రాజమహేంద్రవరం సిటీలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత కూడా సిటీ అభ్యర్థి మార్గాని భరత్ డివిజన్‌ల వారీ బూత్ ఇన్‌చార్జిలతో మీటింగ్‌లు పెడుతూ అక్కడకు వలంటీర్లను కూడా పిలుస్తున్నారని చెబుతున్నారు. ఈ విషయం బయటకు రావడంతో పాటు రాజమహేంద్రవరం అర్బన్ ఆర్వో, మున్సిపల్ కమిషనర్ దృష్టికి వెళ్లగా సుమారు 20 మందికిపైగా వలంటీర్లను పిలిచి హెచ్చరించడం గమనార్హం. వచ్చే నెలలో పింఛన్లు ఇచ్చే సమయంలో కూడా వలంటీర్లతో నేరుగా ఓటర్లకు వైసీపీకి ఓటు వేయమని చెప్పించడానికి ఆ పార్టీ నాయకులు ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. ఇక రాజమహేంద్రవరం సిటీలో వైసీపీ నేతల సమావేశాలకు హాజరై, అధికారికంగా అధికారుల దృష్టిలో ఉన్నప్పటికీ వాళ్లను హెచ్చరించి వదిలేయడం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమేననే వాదన మొదలైంది. సిటీలో వైసీపీ అభ్యర్థి పెట్టిన బూత్ కమిటీల మీటింగ్‌లకు హాజరైన సుమారు 20మందికి పైగా వలంటీర్లను మంగళవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఉన్న మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్ తన దగ్గరకు పిలిచి ఆగ్రహం వ్యక్తం చేశారు. సస్పెండ్ చేస్తానని, తీవ్ర చర్యలు తప్పవని, పోస్టు నుంచి తీసివేస్తామని హెచ్చరించినట్టు సమాచారం. ఎన్నికల కమిషన్ ఆదేశించినప్పటికీ, పట్టించుకోకుండా వలంటీర్లు వైసీపీ మీటింగ్‌కు వెళ్లడం ఉల్లంఘనే. అంతేకాదు... వారి మీద చర్యలు తీసుకోకపోవడం కూడా నియమావళి ఉల్లంఘన కిందకే వస్తుందని ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికే కోనసీమ జిల్లాలో 16 మంది వలంటీర్లను సస్పెండ్ చేశారు. ఇప్పటికైనా వలంటీర్లు బరితెగింపు విధానాలు మానకపోతే ఇబ్బందుల్లో పడక తప్పదు.

వలంటీర్లకు తాయిలాలపై తునిలో విచారణ

తుని రూరల్, మార్చి 19: కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో 1000మందికిపైగా వలంటీర్లకు, కొంతమంది పోలీస్ సిబ్బందికి సెల్‌ఫోన్‌లు పంపిణీ చేశారని, వెలుగు, మెప్మా పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి నగదు పంపిణీ చేశారని ఆరోపిస్తూ టీడీపీ నేతలు ఈసీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. దీనిపై ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ద్వారా వలంటీర్ల నుంచి వివరణ తీసుకోవాలని ఎంపీడీవోలకు ఆదేశాలు ఇచ్చారు.

కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థిగా తంగెళ్ల ఉదయ్



- ప్రకటించిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్

కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థిగా ఆ పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, టీ టైం అధినేత తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌ను పవన్ మంగళవారం ప్రకటించారు. వాస్తవానికి కాకినాడ ఎంపీ సీటు నుంచి టీడీపీ అభ్యర్థి బరిలోకి దిగుతారని తొలుత చర్చ జరిగింది. కానీ పొత్తు నేపథ్యంలో టిక్కెట్‌ను జనసేన దక్కించుకుంది. దీంతో పలువురు పోటీకి సిద్ధమైనా అసలు అభ్యర్థి ఎవరనేదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. స్వయంగా పవన్‌కల్యాణ్ బరిలోకి దిగుతారంటూ కొంతకాలం విస్తృతంగా చర్చ నడిచింది. కానీ తాను పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని పవన్ ఇటీవల ప్రకటించడంతో కొంత గందరగోళానికి తెరపడింది. - ఆంధ్రజ్యోతి, కాకినాడ



కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి రథోత్సవ దృశ్యం (ఫైల్‌ఫొటో)

నరసన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

నేడు కల్యాణోత్సవం.. రథోత్సవం

- కోరుకొండ



ఎన్నికల యంత్రాంగానికి దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్, జేసీ

ఈ.. ఆస్తులపై ఎన్నికల ప్రచారం నిషేధం

- ప్రభుత్వ ఆస్తులు, ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రచారం కుదరదు
- ప్రైవేట్ భవనాలపై వాల్ రైటింగ్స్‌కు అనుమతి లేదు
- ఆటోలు, ఇతర వాహనాలపై పార్టీల ఫొటోలు, స్లోగన్స్ నో
- జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత

రాజమహేంద్రవరం,మార్చి19(ఆంధ్రజ్యోతి): ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఇష్టానుసారం ప్రచారం చేసుకోవడానికి వీలులేదు. బరితెగించే రాజకీయ పార్టీలను దృష్టిలో పెట్టుకునే, అనవసర ప్రచారానికి అడ్డుకట్ట వేయాలో, ఓటర్లను ప్రభావితులు కాకుండా చూడడం కోసమోకానీ ఎన్నికల కమిషన్ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రచారం విషయంలో కఠిన నిబంధనలు అమలులోకి తెచ్చింది. అంతేకాదు రోడ్ల పక్కన ఉన్న ప్రధాన హోర్డింగ్‌లను అన్ని పార్టీలకు సమానంగా కేటాయించాలని కూడా ఆదేశించింది. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్‌మీనా మంగళవారం జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈసందర్భంగా ముఖేష్‌కుమార్ సూచించిన విషయాలను కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత జిల్లాలోని ఎన్నికల యంత్రాంగానికి వివరించారు. ప్రభుత్వ, వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగ్‌లు, పోస్టర్లు, బ్యానర్లకు అనుమతి లేదన్నారు. జాతీయ రహదారి, ఇతర రోడ్లపక్కన ఉన్న హోర్డింగ్‌లు అన్ని రాజకీయ పార్టీలకు సమానంగా ఇవ్వాలన్నారు. పైగా నూతన హోర్డింగ్‌లకు కూడా అనుమతి లేదన్నారు. ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ ప్రకటనలు, పోస్టర్లు, హోర్డింగ్‌లు, బ్యానర్ల ప్రదర్శన విషయంలో జిల్లా ఎన్నికల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖేష్‌కుమార్ ఆదేశించారు. ప్రైవేట్ భవనాలు వాల్ రైటింగ్‌కు అనుమతి లేదని, ఇప్పటికే రాతలు ఉంటే చెరిపివేయాలని కూడా సూచించారు. ప్రభుత్వ అనుమతితో ఇప్పటికే ప్రైవేట్ భవనాలు ఉన్న పెద్ద హోర్డింగ్‌లు, కటౌట్ల భద్రతను నిర్మాణ స్థిరత్వాన్ని పరిశీలించి, నిర్మాణంలో ఏమాత్రం ధృఢత్వం లేకపోయినా ప్రకటలకు అనుమతించవద్దని కూడా సూచించారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి ఓటర్లను ప్రభావితం చేయడానికి తెచ్చే మద్యం, ఇతర రకాల వస్తువల అక్రమ రవాణాను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. రాజకీయ పార్టీలు ఉద్యోగులకు, ఓటర్లకు నగదు, బహుమతుల వంటి తాయిలాలు పంపిణీ చేసే అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తామన్నారు. సీ-విజిల్ ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించడానికి ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్మెంట్ వ్యవస్థను పెద్దఎత్తున వినియోగించుకోవాలన్నారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లు, విమానాశ్రయం, వంతెనలు, రైల్వే రోడ్‌వేలపై ప్రచారాలు నిషేధం అన్నారు. వ్యాపార సముదాయాల వద్ద వ్యాపార ప్రకటనలు తప్ప రాజకీయ ప్రచారం కోసం వినియోగించకూడదని హెచ్చరించారు. కార్లు, ఆటోలు, ఇతర వాహనాల మీద ఎటువంటి రాజకీయ పార్టీల ఫోటోలు, స్లోగన్స్ ఉండకూడదని, ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో రాజమహేంద్రవరం రూరల్ ఆర్వో, జేసీ ఎస్.తేజ్‌భరత్, అర్బన్ ఆర్వో, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, కొవ్వూరు ఆర్వో సబ్‌కలెక్టర్ అశుతోస్ శ్రీవాత్సవ్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్, డీర్వో జి.నరసింహులు, రాజానగరం ఆర్డీవో ఎ.చైత్ర వర్షిణి, గోపాలపురం ఆర్వో కెఎల్.శివజ్యోతి, నిడదవోలు ఆర్వో ఆర్‌వీ రమణానాయక్, అనపర్తి ఆర్వో ఎం.మాధురి తదితరులు పాల్గొన్నారు.



క్రెడిట్ ప్లాన్ విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్

2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.13,201 కోట్లతో రుణ ప్రణాళిక

రాజమహేంద్రవరం రూరల్,మార్చి19: జిల్లాకు సంబంధించి వ్యవసాయ, అనుబంధ రంగాలకు 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను 13 వేల 201కోట్ల రుణ ప్రణాళికతో డాక్యుమెంటు రూపొందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి క్రెడిట్ ప్లాన్‌ను సంబంధిత అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ ఆర్థిక సంవత్సరానికి చెందిన వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి రుణాలను విరివిగా అందించాలని బ్యాంకర్లను కోరారు. ఈ సందర్భంగా నాబార్డు జిల్లా అధికారి డాక్టర్ వై ఎస్ నాయుడు వివిధ బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్య సాధన వివరాలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, హార్టికల్చర్ అధికారి సుజాతకుమారి, డీసీసీబీ, సీజీజీ బ్యాంక్, ఇతర బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యూషకుమారి

ఖైదీల పిల్లల పట్ల వివక్ష తగదు

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

రాజమహేంద్రవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఖైదీల పిల్లల పట్ల సమాజంలో వివక్ష తగదని.. అలాంటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి పేర్కొన్నారు. మంగళవారం కేంద్ర కారాగారంలోని ఖైదీల కుటుంబ సభ్యులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆస్తి వివాదాలు, కుటుంబ సభ్యుల మధ్య సమస్యలు, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోవడం, ఆర్థిక సమస్యల వల్ల పిల్లల చదువులు ఆగిపోవడం వంటి ఇబ్బందులు ఉంటే డీఎల్ఎస్ఏని సంప్రదించడం ద్వారా పరిష్కారం దొరుకుతుందని ఆమె చెప్పారు. అలాగే ఓఎన్‌జీసీలో ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో వివిధ మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు.

వైసీపీ పంకా వంకరే



- 'గాలి'లోని అంతర్గత పోరు తారస్థాయికి
- ప్రతి నియోజకవర్గంలోనూ ఇంతే
- రాజమండ్రి సిటీ, రూరల్ చెరోదారి
- శిలాఫలకాలకే కొందరు పరిమితం
- కొవ్వూరులో బహిరంగంగా కుమ్ములాటలు
- నిడదవోలు, రాజానగరం, అనపర్తిలో
- సొంత సామాజికవర్గం నుంచీ వ్యతిరేకత

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తుతో పరుగులు పెడుతుంటే.. జిల్లాలోని వైసీపీ పంకా వంకర పోతోంది. 'గాలి'కి వేగలేక వైసీపీ నాయకులు అల్లాడుతున్నారు. అంతర్గత పోరు, వర్గ విభేదాలకు వైసీపీ పెట్టింది పేరు. ముందు నుంచీ పార్టీలో అదే తీరు. ఎన్నికల వేళ సమీపిస్తుండడంతో అది మరీ తారస్థాయికి చేరింది. సమావేశాల్లో బహిరంగంగానే విమర్శించుకుంటున్నారు. వర్గాల వారీగా వైసీపీ నాయకులు విడిపోయారు. ఎవరి దారి వారిదే అన్నట్టుగా పయనం సాగుతోంది. ఉదాహరణకు రాజమహేంద్రవరంలోని ఆర్యాపురం అర్బన్ బ్యాంకు ఛైర్మన్ పదవి విషయం రచ్చకెక్కింది. తన వారికి దక్కించుకోవాలని ఎంపీ భరత్, తమ వారికే పదవులు రావాలని మంత్రి వేణు సిగపట్లు పడుతున్నారు. అటు కొవ్వూరులోని సమన్వయకర్త విషయంలో కాపు వర్గం భగ్గుమంటోంది. ఏదేమైనా పార్టీలో అంతర్గత కుమ్ములాటలు జఠిలంగా మారాయి. వైసీపీ పంకా ముందు నుంచీ వంకరేననే మాటను రుజువు చేస్తున్నాయి.

● సిటీలో అంతేగా..

రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్ తన పరిధిలోని ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లనూ వదిలేసి రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గానికే పరిమితమై కార్యకలాపాలు సాగించారు. ఆయన కోరుకున్న విధంగానే వైసీపీ తరపున సిటీ నియోజకవర్గం నుంచి బరిలో నిలవడం ఖాయమైంది. అయితే రాజమహేంద్రవరంలో నేనేరాజు నేనే మంత్రి అనే చందంగా లాక్కొచ్చిన భరత్ రామ్‌కి కూడా ఈమధ్య అసహనం పెరిగిందని వైసీపీ వర్గాల్లో ఎక్కువగా వినిపిస్తోంది. ముందునుంచీ పార్టీలోని పెద్ద వ్యక్తులను ఎవరినీ దగ్గరకు రానీయలేదు. ఎంపీగా తన పదవీకాలం చివరిలో రాజమహేంద్రవరం సిటీకి సంబంధించి ఇద్దరు ముగ్గురు పెద్దల అనుభవాన్ని ఓట్ల కోసం గౌరవించే పాచిక వేశారు. ఇందులో ప్రధానంగా ఎన్నికలు ఇంకా మూడు నెలలు ఉన్నాయనగా భరత్‌కి వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు గుర్తొచ్చారు. ఆయనకు గుడా ఛైర్మన్‌గా స్థానం కల్పించారు. ఇన్నేళ్లూ ఆయనను కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇక తనను వ్యతిరేకించే మేడపాటి షర్మిలారెడ్డికి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవి ద్వారా రాజమహేంద్రవరం నగరంతో ఉన్న సంబంధాల్ని దూరం చేసే వ్యూహం పన్నారని ఇప్పటికే ఆ పార్టీ వర్గాల్లో చర్చ నడిచింది. మరోవైపు రాజానగరం నియోజకవర్గానికే జక్కంపూడి రాజా కుటుంబాన్ని భరత్ రామ్ పరిమితం చేయగలిగారు. ఇదే సమయంలో భరత్ రామ్ తీరుతో వైసీపీలో అంతర్గత పోరు నడుస్తూనే ఉంది. ఎన్నికల నియమావళి వచ్చిన తర్వాత తొలిసారిగా సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎంపీ ఒక్కరే దర్శనమిచ్చారు. మిగతా వారినెవరినీ వేదిక ఎక్కనివ్వలేదనే అంశం ఆ పార్టీ నేతల్లో అసంతృప్తిని పెంచుతోంది.

● రూరల్ తీరిదీ..

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి అయిన చెల్లుబోయిన వేణుతో కూడా భరత్‌కి పొసగడం లేదనేది వాస్తవం. ఆయన వెంట జక్కంపూడి వర్గీయులు తిరుగుతుండడమే అందుకు నిదర్శనం. తాను రూరల్ ఇన్చార్జిగా నియమితులైనప్పటి నుంచీ మంత్రిగిరీ పక్కన పెట్టి నియోజకవర్గంలో కలియదిరుగుతున్నారు. అయినా ఎంపీ వెళ్లింది లేదు. సిటీ పరిధిలోని రూరల్ వార్డుల్లోని కార్యక్రమాలకు మాత్రం ఎంపీ హాజరవుతుండడం గమనార్హం. ఇక రూరల్ సీటుపై ఎప్పటి నుంచో ఆశలు పెట్టుకొని కేడర్‌ని కూడగట్టుకున్న చందన నాగేశ్వర్‌కి భరత్ తన స్టైల్లో మొండిచేయి చూపించారు. రూరల్ సీటు వేణుకు కేటాయించడంతో ముందు నుంచీ భరత్‌కి వెన్నంటే ఉన్న నాగేశ్వర్‌ని పక్కన పెట్టి శిలాఫలకాల్లో పేరుకు మాత్రమే పరిమితం చేశారు. వేణు సమావేశాల్లో కూడా ఆయనకు స్థానం కల్పించడం లేదు.

● మిగతా నియోజకవర్గాల్లోనూ...

రాజానగరం నియోజకవర్గం చాలా ఏళ్ల నుంచి కమ్మ సామాజికవర్గానికి పెట్టనికోట. ఆ స్థానాన్ని కాపు సామాజికవర్గానికి చెందిన జక్కంపూడికి ఇప్పించారు. ఎమ్మెల్యేగా నెగ్గించుకున్నారు. తీరా పదవి వచ్చిన తర్వాత తన తండ్రి జక్కంపూడి రామ్మోహన్‌రావుతో తిరిగిన సీనియర్ నాయకులను రాజా పక్కన పెట్టారనే వాదన ఉంది. దీంతో ఆయన సొంత పార్టీలోని సొంత సామాజికవర్గానికి చెందిన కొందరు అసమ్మతికి తెరతీశారు. కొందరు జనసేన గూటికి వెళ్లారు. ఇప్పుడు నియోజకవర్గంలోని మూడు మండలాల్లోనూ జక్కంపూడి రాజాపై వైసీపీలో, కాపు సామాజికవర్గంలో వ్యతిరేకవర్గం నడుస్తోంది. సీతానగరం మండలంలోని ఓ ఊర్లో పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని చెబుతున్నారు. నిడదవోలు సిట్టింగ్ ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడుకు సొంత పార్టీలోని ఆయన సామాజికవర్గంలోనే వ్యతిరేకత ఉంది. తన సామాజికవర్గాన్ని పట్టించుకోలేదని, తగిన గౌరవం ఇవ్వలేదనే ఆరోపణలున్నాయి. బీసీల్లోనూ గౌడ వర్గం పూర్తిగా వ్యతిరేకిస్తోందనే విమర్శలున్నాయి. గత ఎన్నికల్లో నిడదవోలు నుంచి భరత్‌రామ్ పోటీలో ఉంటారనే ప్రచారం నడిచింది. దీంతో ఆయన సొంత సామాజిక వర్గమైన గౌడ సామాజికవర్గీయులు ఆ వైపు తిరిగారు. దీంతో వారిని సమావేశం ఏర్పాటుచేసి మరీ శ్రీనివాసనాయుడు గద్దించారు. ఇది గౌడల మనసులో పాతుకుపోయిందని అంటున్నారు. కొద్దినెలల కిందట కొందరు గౌడ సామాజికవర్గానికి చెందిన వారు నిడదవోలు నియోజకవర్గం నుంచి వచ్చి భరత్‌రామ్ కోసం పనిచేస్తుండడమే దానికి కారణమని చెబుతున్నారు. కొవ్వూరులో వైసీపీలోని అంతర్గతపోరు రచ్చకెక్కింది. కొవ్వూరులో తానేటి వనిత ఉన్న సమయంలో రెండు వర్గాలుండేవి. ఏదో తేడా కొడుతుండడంతో ఆమెను గోపాలపురం రాజకీయ బదిలీ చేశారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కొవ్వూరు తీసుకొచ్చారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదని సోమవారం జరిగిన పార్టీ సమావేశంలో తేలిపోయింది. నియోజకవర్గ సమన్వయకర్త విషయంలో కొంతకాలంగా విభేదాలు నడుస్తున్నాయి. వైసీపీ పెద్దలు అటూఇటూ మార్పులు చేసినా చివరికి మళ్లీ రాజీవ్‌కృష్ణకే చోటు కల్పించారు. దీంతో కాపు సామాజికవర్గం భగ్గుమంటోంది. తమ వర్గానికే ఆ స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి. రాజకీయాలు కొత్త అయిన ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌కి ఇవన్నీ తలనొప్పిగా మారాయి. అనపర్తిలో ముందు నుంచీ పరిస్థితి చాపకింద నీరులా ఉంది. సిట్టింగ్ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఎవరినీ కలుపుకుని వెళ్లరనే విమర్శలున్నాయి. ఇప్పటికీ నియోజకవర్గంలో తనకోసం, పార్టీకోసం పనిచేసిన వాళ్లను వదిలేసి పది మంది బంధువర్గంతో పార్టీని నడుపుతున్నారనేది బహిరంగంగానే వినిపిస్తుంటుంది. ఉదాహరణకు మల్లిడి ఆదినారాయణరెడ్డి 2014లో జడ్పీటీసీగా పోటీ చేశారు. వైసీపీ ఆవిర్భావం నుంచి ఉన్నారు. సూర్యనారాయణరెడ్డి గెలుపు కోసం కృషి చేశారు. ఆయన నెగ్గిన తర్వాత బంధువర్గాన్ని చేర్చుకొని ఆదినారాయణరెడ్డిని పక్కన పెట్టేశారు. దీంతో ఆయన ఆవేదనతో సైలెంట్ అయిపోయారు. ఆయన తమ్ముడు మల్లిడి కృష్ణారెడ్డి ఇటీవల టీడీపీలో చేరారు. అటు గోపాలపురం నియోజకవర్గంలో కూడా హోంమంత్రి తానేటి వనిత సొంత పార్టీలోని స్థానిక నేతల అసమ్మతి రాజకీయాలతో తలపడుతున్నారు.

ఆపరేషన్ల కోసం నెట్‌వర్క్ ఆసుపత్రులకు పంపాలి

డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు



సురక్ష శిబిరంలో వైద్యసేవలు పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో

ఉండ్రాజవరం, మార్చి 19: ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి నెట్‌వర్క్ ఆసుపత్రులకు పంపాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. మంగళవారం మండలంలోని తాడిపర్రులో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించి, వారు మెరుగైన వైద్యసేవలు పొందేందుకు తరలించాలని సూచించారు. రోగులకు వైద్యులందిస్తున్న సేవలను, మందులు పంపిణీ కార్యక్రమాన్ని డీఎంఅండ్‌హెచ్‌వో పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్లు ఆర్ఎస్ ప్రసాద్, ఉషాదేవి, సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

'పది' హిందీ పరీక్షకు 71 మంది గైర్హాజరు

కొవ్వూరు, మార్చి 19: కొవ్వూరు పట్టణ, మండలంలో పదో తరగతి హిందీ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 8 పరీక్షా సెంటర్లలో 1324 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 1253 మంది హాజరు కాగా 71 మంది గైర్హాజరయ్యారయినట్టు డీవైఈవో కె.వాసుదేవరావు తెలిపారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు



ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ మస్తాన్

కొవ్వూరు, మార్చి 19: కొవ్వూరులోని ఏబీఎన్,పీఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో స్వీప్, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. తహశీల్దార్, ఏఈఆర్వో కె.మస్తాన్ ఈవీఎం, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాడ్ ఉపయోగంపై అవగాహన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ ఓటర్లు నైతిక విలువలతో కూడిన ఓటింగ్ వైపు పయనించాలని, ఓటు ఆవశ్యకతను పెద్దలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ ఎం.కమల్ సుందర్, స్వీప్ కోఆర్డినేటర్ జోడాల వెంకటేశ్వరరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.రమేష్, సంఘటన్ వలంటీర్ ఆకుల సత్యసాయి పాల్గొన్నారు.

నేడు మదనగోపాలస్వామి కల్యాణోత్సవం

తాళ్లపూడి, మార్చి 19: తాళ్లపూడిలో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి కల్యాణోత్సవాన్ని ఈ నెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ ప్రముఖ వ్యాపారవేత్త సింహాద్రి జనార్ధన్ నేతృత్వంలో నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. 20న సుప్రభాత సేవ, విశ్వక్సేన పూజ, అంకురార్పణ, వాస్తు పూజలు, స్వామివారి కల్యాణం, 21న స్వామి వారి రథోత్సవం, 22న అన్నసమారాధన నిర్వహించనున్నట్టు చెప్పారు.

జనసేనలో చేరికలు



జనసేనలో చేరిన యువకులతో వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, మార్చి 19: జనసేన పార్టీ మండలాధ్యక్షుడు గంటా కృష్ణ, గ్రామాధ్యక్షుడు అయితం మణికంఠ ఆధ్వర్యంలో వైసీపీ నుంచి పలువురు యువకులు జనసేనలో చేరారు. మంగళవారం వైసీపీ నాయకుడు గంటా మణికంఠ తన వర్గంతో జనసేనలో చేరగా వారికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి గాయత్రీ వెంకటేశ్వరరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో చాగల్లు మండలాధ్యక్షుడు ఉప్పులూరి చిరంజీవి, బండ్రెడ్డి నాగేశ్వరరావు, దేవన సత్యనారాయణ, ఏసులంక తాతారావు, అంజి తదితరులు పాల్గొన్నారు.

5కె మారథాన్‌లో రవికి ద్వితీయ స్థానం



నిడదవోలు, మార్చి 19: విశాఖపట్టణంలో అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇండియా, సెక్యూరిటీ ఎక్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఇటీవల భారత్ నివేష్ మారథాన్ నిర్వహించారు. ఈ పోటీల్లో నిడదవోలులోని ఎస్వీఆర్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకామ్ మొదటి సంవత్సరం చదువుతున్న ఎమ్.రవి అండర్-17 విభాగంలో 5కె మారథాన్ పాల్గొని రెండో స్థానాన్ని గెలుచుకున్నాడు. అలాగే రవి గతంలో మీరట్‌లో జరిగిన కిక్‌బాక్సింగ్ పోటీలకు ఎంపికై ఉత్తమ ప్రతిభను ప్రదర్శించాడు. ఈ సందర్భంగా విద్యార్థికి కళాశాల బృందం బాక్సింగ్ గ్లౌజెస్ అందజేసి ప్రత్యేకంగా అభినందించింది.

సాయుధ బలగాల కవాతు



నిడదవోలు, మార్చి 19: నిడదవోలు మండలం సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం సమిశ్రగూడెం, అట్లపాడు గ్రామాల్లో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అవగాహన కలిగిస్తూ ఈ కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్, ఏఎస్ఐ పరమహంస తదితర్లు పాల్గొన్నారు.

నూరు శాతం జీతం జీవో అమలు చేయాలి

నల్లజర్ల, మార్చి 19: నూరు శాతం జీతం జీవో వచ్చి ఆర్నెళ్లు దాటినా నేటికీ జీవో అమలుకు నోచుకోకపోవడం దురదృష్టకరమని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వేతనాలకు సంబంధించిన సమస్యలపై జిల్లా ప్రధాన కార్యాలయాల్లో వినతిపత్రాలు అందించామన్నారు. నూరు శాతం జీతం జీవో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వెలమలకు టీడీపీ అండదండలు: ముప్పిడి



వెలమ సంఘ నాయకుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ముప్పిడి

కొవ్వూరు, మార్చి 19: దేశంలో వెలమలకు తెలుగుదేశం పార్టీ ఇచ్చిన అండదండలు ఏ రాజకీయ పార్టీ ఇవ్వలేదని టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కొవ్వూరులో జయహో బీసీ కార్యక్రమంలో భాగంగా వెలమ సంఘ నాయకులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు లబ్ధి చేకూరిందని, వైసీపీ పాలనలో ఒరిగిందేమి లేదన్నారు. బీసీలకు టీడీపీ వెన్నుముక లాంటిదని, పార్టీని ఏకతాటిపై గెలిపించుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురానున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, రాజాన శ్రీనివాస్, రంభ హరిబాబు, బర్ల శ్రీనివాస్, మాదిరెడ్డి సతీష్, దగ్గు శ్రీను, బర్ల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

22న విద్యుత్ వినియోగదారుల క్యాంప్ కోర్టు

కొవ్వూరు, మార్చి 19: కొవ్వూరు ఏపీఈపీడీసీఎల్ సబ్ డివిజనల్ కార్యాలయంలో ఈ నెల 22న విద్యుత్ వినియోగదారుల క్యాంపు కోర్టు (సమస్యల పరిష్కార వేదిక) నిర్వహిస్తున్నట్టు ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమం సీజీఆర్ఎఫ్ చైర్మన్, రిటైర్డ్ న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరుగుతుందని, వినియోగదారులు సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని చెప్పారు.

వరిలో శాస్త్రీయ సాగుతో అధిక దిగుబడులు

» ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ నరసింహారావు

» పలు గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటల క్షేత్ర సందర్శన



కొవ్వూరులో రైతులకు సూచనలిస్తున్న నరసింహారావు

కొవ్వూరు/తాళ్లపూడి, మార్చి 19: శాస్త్రీయ పద్ధతిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి దాళ్వాలో వరి సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలోని కొవ్వూరు, నందమూరు, తాళ్లపూడి, గజ్జరం, ప్రక్కిలంక గ్రామాల్లో మంగళవారం వరి, మొక్కజొన్న పంటల క్షేత్ర సందర్శన చేసి, రైతులకు సూచనలు, సలహాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దాళ్వా పంటలు చీడపీడల ఉధృతి తక్కువగా ఉండి ఆరోగ్యకరంగా ఉన్నాయన్నారు. వరి పంట ఈనిక దశ నుంచి పక్వ దశకు వస్తుందన్నారు. ఈ క్రమంలో అక్కడక్కడ కాండం తొలుచు పురుగు ఉన్నట్టు గుర్తించామన్నారు. దాని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు 1 లీటరు నీటికి లేదా క్లోరంట్రనిలిప్రోల్ 0.3మిల్లీ లీటర్లు 1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. నానో యూరియా వాడకంపై మార్టేరు పరిశోధనా కేంద్రంలో పరిశోదనలు జరుగుతున్నాయని, ఫలితాలు వచ్చిన తర్వాత సిఫారసు చేస్తామన్నారు. మొక్కజొన్న విత్తన ఉత్పత్తి సంతృప్తికరంగా ఉందని, రైతులు శాస్త్రవేత్తలు సూచించిన పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు ఏడీఏ కె.చంద్రశేఖర్, కొవ్వూరు, తాళ్లపూడి ఏవోలు ఎ.గంగాధర్, రుచిత, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'ప్రజాగళం'లో భద్రతా వైఫల్యాలపై విచారణ చేపట్టాలి

» టీడీపీ గోపాలపురం, కొవ్వూరు అభ్యర్థులు మద్దిపాటి, ముప్పిడి

గోపాలపురం/నల్లజర్ల/చాగల్లు, మార్చి 19: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరైన బొప్పూడిలో జరిగి ప్రజాగళం సభలో భద్రతా వైఫల్యాలపై విచారణ చేపట్టాలని, భద్రత కల్పించాల్సిందిపోయి నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకోవాలని టీడీపీ-జనసేన-బీజేపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు, కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గోపాలపురంలోని చెదలవాడ ప్రసాద్ నివాసం వద్ద, చాగల్లులో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశాల్లో వారు మాట్లాడారు. ప్రజాగళం సభలో కూటమికి చెందిన కార్యకర్తలు, అభిమానులంతా పాల్గొని సభను విజయవంతం చేశారన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి సమావేశం రాష్ట్రానికి, దేశానికి విజయసంకేతం పంపించిందన్నారు. అయితే దేశప్రధాని హాజరైన సమావేశంలోనే రాష్ట్ర పోలీసులు నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అయితే పోలీసుల నిర్లక్ష్యం కారణంగా ట్రాఫిక్ జామ్ వల్ల వేలాది మంది కార్యకర్తలు సభకు రాలేక మార్గమధ్యలోనే ఉండిపోయారన్నారు. ఏపీ ప్రజలకు అండగా ఉంటానని ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి ఆగిపోయిందని మోదీ అన్నారన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వంపై ప్రజాగళం ఏ స్థాయిలో ఉందో చిలకలూరి పేట సభ ద్వారా తేటతెల్లమయ్యిందన్నారు. ఈ అరాచక పాలనకు అంతం పలుకుదామని ప్రధాని పిలుపునిచ్చారన్నారు. ప్రధాని భద్రత, జనం, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలను పోలీసు బాసులు ఎందుకు పట్టించుకో లేదో చీఫ్ ఎలక్షన్ కమిషన్ సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. ఉన్నత చదువులు చదివి పార్టీలకు అండగా ఉంటున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోపాలపురం సమావేశంలో మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, జ్యేష్ట శ్రీధర్, కూనపం ప్రసాద్‌బాబు, కాట్రగడ్డ సురేష్, దాసరి రవి, పడమట శ్రీను, కోడవటి చినవెంకటేశ్వరరావు, తానేటి రాఘవులు, కోడవటి గంగరాజు పాల్గొనగా చాగల్లు సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, కేతా సాహెబ్, నాదెళ్ళ శ్రీరామ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గోపాలపురంలో విలేకర్లతో మాట్లాడుతున్న మద్దిపాటి వెంకట్రాజు



చాగల్లులో మాట్లాడుతున్న ముప్పిడి వెంకటేశ్వరరావు

ఆదిరెడ్డి వాసుపై బురదజల్లేందుకు భరత్ యత్నం

» గంజాయి కేసులో పట్టుబడ్డ చోటు ఎంపీ అనుచరుడే

» తెలుగుదేశం పార్టీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 19: టీడీపీ-జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్‌పై ఎంపీ మార్గాని భరత్‌రామ్ కుట్ర చేసి బురద జల్లే ప్రయత్నం చేశారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవి వరప్రసాద్ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భరత్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే వాసుపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాజమహేంద్రవరంలో బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయి బ్యాచ్‌లను పెంచిపోషిస్తున్న భరత్ ఆ బురదను వాసుకు అంటించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. టీడీపీ అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్ మాట్లాడుతూ చోటు అనే వ్యక్తి భరత్ అనుచరుడని, అతడికి హైదరాబాద్‌లో ప్రియురాలు వుందని, ఆమె అన్నను గంజాయి కేసులో ఇరికించి అన్నాచెల్లెళ్లను విడగొట్టేందుకు ప్లాన్ చేసిన చోటు.. స్నేహితుడిగా ఉన్న జాకీ షారాఫ్‌ను వాడుకున్నాడని, ఈ ఘటనలో చోటు ప్లాన్ తల్లకిందులై చోటు, అతడి స్నేహితులు ఇరుక్కున్నారన్నారు. అయితే తెలుగు యువతలో ఉన్న జాకీషారాఫ్‌కు ఈ కేసును లింక్ చేసి భరత్‌రామ్ కుట్రచేసి ఆదిరెడ్డిపై బురద జల్లుతున్నాడన్నారు. ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు చాపల చిన్నరాజు మాట్లాడుతూ భరత్ అనుచరులుగా ఉన్న విక్రమ్‌రెడ్డి నేరుగా గంజాయి కేసులో పట్టుబడినా, పీతా రామకృష్ణ రౌడీయిజం చేసి తమ పార్టీ మహిళ నాయకురాలినే పోడిచేస్తానని బెదిరించినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వాస్తవాలు ప్రజలకు తెలుసునని, త్వరలో గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో తెలుగుయువత నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ కందికొండ అనంత్, తాడి దుర్గాప్రసాద్, బూరా రమణ, కానేటి ప్రభుదాస్, దుత్తరపు గంగాధర్, పొట్ట ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

ప్రజాసంకల్ప యాత్రను విజయవంతం చేయండి

నేడు గౌరీపట్నం నుంచి ప్రారంభం: టీడీపీ నాయకులు

దేవరపల్లి/గోపాలపురం, మార్చి 19: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని, మద్దిపాటి వెంకట్రాజు ఎమ్మెల్యేగా విజయం సాధించాలని కోరుతూ గౌరీపట్నం దైవ సన్నిధి నుంచి ద్వారకాతిరుమల దేవాలయం వరకు జరుగుతున్న సంకల్పయాత్రలో టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ గోపాలపురం, దేవరపల్లి మండలాధ్యక్షులు రొంగలి సత్యనారాయణ, ఆండ్రూ అనిల్ మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు జరిగే ఈ యాత్ర బుధవారం ఉదయం 8గంటలకు గౌరీపట్నంలోని పుణ్యక్షేత్రంలో మేరీమాతను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం సంకల్పయాత్ర ప్రారంభమవుతుందన్నారు. అక్కడ నుంచి దుద్దుకూరు చేరుకుని గోపాలపురం మండలంలో ప్రవేశిస్తారన్నారు. తదుపరి చెరుకుమిల్లి, వెంకటాయపాలెం, చిట్యాల గ్రామాల మీదుగా పాదయాత్రగా వెళ్లి పెద్దాపురం, వేలచింతలగూడెం, గోపాలపురం మీదుగా వాదాలకుంట, వెదుళ్ళకుంట గ్రామం వరకు మొదటిరోజు సంకల్పయాత్ర నిర్వహిస్తారన్నారు. ఎన్‌డీఏ భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

'జవహర్‌కు సీటు కేటాయించకపోవడం అన్యాయం'



కొవ్వూరు, మార్చి 19: తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో పనిచేసిన జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్‌కు సీటు కేటాయించకుండా అన్యాయం చేసిందని మహిళలు వాపోయారు. మంగళవారం సాయంత్రం నియోజకవర్గంలోని మహిళలు జవహర్ నివాసానికి చేరుకుని మద్దతు తెలిపారు. పార్టీ అన్యాయం చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. జవహర్ తీసుకునే నిర్ణయాలకు తామంతా అండగా నిలుస్తామన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో దళితులకు సముచిత స్థానం ఇవ్వకుండా గోపాలపురం నుంచి దిగుమతి చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

మరో ఇద్దరికి తీవ్రగాయాలు.. ఒకరి పరిస్థితి విషమం



సుకీర్(ఫైల్)

నల్లజర్ల, మార్చి 19: నల్లజర్లలో జాతీయ రహదారిపై బైక్ డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో మారంపల్లి సుకీర్(18) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. ఏఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. కృష్ణ జిల్లా కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామానికి చెందిన మారంపల్లి సుకీర్, కటికల సువర్ణరాజు, ఈశ్వర్ బాల్య మిత్రులు. చుట్టు ప్రక్కల గ్రామాల్లో క్యాటరింగ్ పనులకు వెళుతూ మరో వైపు ఏసీ మరమ్మతుల పనులకు వెళుతుంటారు. ఈ క్రమంలో సువర్ణరాజు సోదరుడు సుశీల్ రాజమహేంద్రవరంలో ఏసీ మరమ్మతులు ఉన్నాయని తెలపడంతో మంగళవారం ఉదయం తమ స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. నల్లజర్ల నిమ్మకాయల మార్కెట్ వద్ద అతివేగంగా డివైడర్‌ను ఢీకొట్టడంతో సుకీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాలైన ఈశ్వర్, సువర్ణరాజులను తాడేపల్లిగూడెం ఏరియా అసుపత్రికి తరలించారు. ఈశ్వర్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

లారీ కార్మికుల ఆందోళన



దుద్దుకూరులో ఆందోళన చేస్తున్న క్వారీ లారీల డ్రైవర్లు

దేవరపల్లి, మార్చి 19: మండలంలోని దుద్దుకూరులో ప్రగతిశీల కార్మిక సమాఖ్య ఆధ్వర్యంలో లారీ కార్మికుల సమావేశం జరిగింది. లారీలపై పని చేస్తున్న కార్మికులకు నూతన వేతన ఒప్పందం కోసం నెల రోజుల క్రితం క్వారీ యాజమానుల సంఘానికి నోటీసులు ఇచ్చినట్టు ప్రగతి శీల కార్మిక సంఘం అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్ తెలిపారు. వేతన ఒప్పందానికి సమయం కావాలని క్వారీ యాజమానులు కోరడంతో ఈ నెల 19న చర్చలు జరపామన్నారు. యజమానుల సంఘం జీతాలు పెంచలేమని, ఒక సంవత్సరం సమయం కావాలని అనడంతో లారీల్లో పనిచేసే కార్మికులు, వివిధ కార్మిక సంఘాలు సమయం ఇవ్వలేమని, అగ్రిమెంట్ జరపాలని కోరగా చర్చలు విఫలమయ్యాయన్నారు. ఈ నెల 23వ తేదీ నుంచి లారీ కార్మికులంతా సమ్మె చేపడతామని యజమానుల సంఘానికి తెలియజేశామని మస్తాన్ చెప్పారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు జాన్‌రాజు, ఆకాష్ బాజీ, సత్యనారాయణ, నాగూర్, యు.ప్రసాదరావు, ఎం.రామకృష్ణ, లారీకార్మికులు పాల్గొన్నారు.

నరసన్న బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

పుట్టమన్ను తెచ్చుట, అంకురార్పణ, ధ్వజారోహణ ఉత్సవాలు

కోరుకొండ, మార్చి 19: కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాలకు మంగళవారం సాయంత్రం పుట్టమన్ను తీసుకురావడంతో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేక పల్లకిలో ఆశీనులను చేసి మేళతాళాలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య పుట్టమన్ను తీసుకురావడానికి అనువంశిక ధర్మకర్త ఎస్‌పీ రంగరాజభట్టర్ ఆధ్వర్యంలో శ్రీ చక్రపెరుమాళ్ళను తీసుకుని దేవుని కోనేరు వద్దకు వెళ్లారు. అక్కడ పుట్టకు శాస్త్రోక్తంగా పూజలు చేసి పుట్టమన్ను సేకరించారు. మన్నుతో నరసన్న దిగువ దేవస్థానం ఆలయ ముఖ మండపానికి చేరుకున్నారు. మట్టి మూకిడిలో వేసి నవధాన్యాలు వేసి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం స్వామి ధ్వజ పతాకాన్ని ధ్వజ స్తంభం వద్ద ఉంచి పూజలు చేశారు. అనంతరం ధ్వజా రోహణం చేశారు. అంతకుముందు స్వామి వారికి ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్ ,ఎస్పీ రంగరాజభట్టర్, లక్ష్మీనరసింహభట్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇదిలా ఉండగా లక్ష్మీనరసింహస్వామి దివ్య దంపతులకు శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ అనంత పద్మనాభ స్వామి వారికి వైకానస ఆగమ శాస్త్రం ప్రకారం బుధవారం రాత్రి 9గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు.

నేడు రథోత్సవం, పండిత సభలు.. నరసన్న కల్యాణానికి ముందు బుధవారం మధ్యాహ్నం 1.58గంటలకు స్వామి వారి రథోత్సవం జరుగుతుంది. అంతకుముందు స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి శుభముహూర్తానికి పల్లకిపైకి తోడ్కుని వచ్చి అతిపెద్దదైన పురాతన రథంపై ఆశీనులు చేస్తారు.అనంతరం రథానికి ముందు ప్రత్యే కార్యక్రమాలు, పూజలు చేస్తారు. తదుపరి అన్నాన్ని రాశిగా పోసి గుమ్మడికాయ కొట్టి రథాన్ని ముందుకు లాగుతారు. సుమారు 4గంటలు పాటు కోరుకొండ నాలుగు మాడ వీధుల్లో భక్తుల గోవింద నామ స్మరణల మధ్య ఈ రథోత్సవం జరుగుతుంది. అలాగే ఉత్సవాల్లో భాగంగా స్థానిక రంగరాజస్వామి ఆలయ ప్రాంగణంలో విశిష్టాద్వైత పండిత సభలు ప్రారంభమవుతాయి. 5 రోజుల పాటు ఉభయ వేదాంత పండితులు ఉదయం, సాయంత్రం భక్తులకు రామాయణ, భాగవత ఆళ్వారుల చరిత్రను ఉపన్యాసిస్తారు.

జాంపేట మార్కెట్లో మత్స్యకారులకు

లాటరీ పద్ధతిలో జాగాల కేటాయింపు

కలెక్టర్‌కు, మునిసిపల్ కమిషనర్‌కు మత్స్యకారుల కృతజ్ఞతలు



సమావేశంలో మాట్లాడుతున్న వెలమ లక్ష్మణరావు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 19: జాంపేట చేపల మార్కెట్లో జాగాల కేటాయింపులకు సంబంధించి పాత విధానాన్ని రద్దుచేసి లాటరీ పద్ధతిలో కేటాయింపులు చేసి మత్స్యకారులకు న్యాయం చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్‌లకు మార్కెట్ కమిటీ గౌరవాధ్యక్షుడు వెలమ లక్ష్మణరావు ధన్యవాదాలు తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాంపేట చేపల మార్కెట్‌లో దళారులు ఎన్నోఏళ్లుగా మత్స్యకారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. మార్కెట్‌లో జాగాల కేటాయింపులు లాటరీ పద్ధతిలో నిర్వహించాలని హైకోర్టుకు వెళ్ళామని, హైకోర్టు ఆర్డర్ ప్రకారం జిల్లా కలెక్టర్, కమిషనర్ లాటరీ విధానంలో జాగాలు కేటాయించారన్నారు. సమావేశంలో గోదావరి బెస్తా మహిళాసంఘం, గోదావరి మాత ఫిషర్ మెన్ సంక్షేమ సంఘం, మత్స్యకార సంక్షేమ సంఘాల ప్రతినిధులు డి.ధనలక్ష్మి, కంచి ప్రభాకరరావు, వెలమ లక్ష్మి, లోని మరిడమ్మ, గొల్ల అచ్చియ్యమ్మ, లక్ష్మీశాంతి, కంచి మురళీ, కంచి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అభివృద్ధిపై

శ్వేతపత్రం విడుదల చేయండి

వైసీపీ మాజీ కార్పొరేటర్లు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 19: మూడు సార్లు మేయర్లుగా చేశామని గొప్పలు చెప్పుకుంటున్న టీడీపీ మాజీ కార్పొరేటర్లు నగరానికి చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేస్తే తామేమి చేశామో శ్వేతపత్రం విడుదల చేస్తామని వైసీపీ మాజీ కార్పొరేటర్లు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని అభివృద్ధిని 2019 నుంచి ఈ ఐదేళ్లలో ఎంపీ భరత్‌రామ్ చేశారని చెప్పారు. నగరంలో సుందరీకరణ పనులు, మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మాణం, కంబాల పార్కు అభివృద్ధి, ఇళ్ల పట్టాలు పంపిణీ ఆయన చేసిందేనన్నారు. దీనిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని ప్రకటించారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్లు పోలు విజయలక్ష్మి, ప్రసాదుల హరినాథ్, వాసంశెట్టి గంగాధర్, గుత్తుల మురళీధర్, బర్రే కొండబాబు, బాపన సుధారాణి, గూడూరి రాధిక, అజ్జరపు వాసు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రమేష్ కిషోర్‌పై విజిలెన్స్ విచారణ!

నేడు కొవ్వూరు సీహెచ్‌సీలో విచారించనున్న అధికారి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 19: పూర్వ డీసీహెచ్ఎస్ డాక్టర్ టి.రమేష్‌కిషోర్‌పై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రమేష్‌కిషోర్ రాజమహేంద్రవరం డీసీహెచ్ఎస్‌గా పనిచేసిన సమయంలో హాస్పిటల్‌లో మహిళా ఉద్యోగినిలపై వేధింపులకు పాల్పడుతున్నాడని, ఆసుపత్రి ఫండ్స్‌లో అవతవకలు జరిగాయని గతంలో అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ తరుపున న్యాయవాదులు గొట్టిముక్కల అనంతరావు, ధర్నాల కోట వెంకటేశ్వరావు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం విచారణ ఆదేశించింది. విచారణాధికారిగా విజయనగరం డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.గౌరిశంకరరావును నియమించింది. ఈ మేరకు బుధవారం కొవ్వూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో విచారణ నిర్వహించనున్నట్టు డీసీహెచ్ఎస్ డాక్టర్ సనత్‌కుమారి పేర్కొన్నారు.

నరేంద్రపురంలో వ్యక్తి ఆత్మహత్య

అప్పులభారం తాళలేక బలవన్మరణం



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రాజానగరం, మార్చి 19: అప్పుల భారంతో మండలంలో నరేంద్రపురం గ్రామానికి చెందిన మద్దూరి శ్రీను(47) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీను గతంలో ఫ్రూట్స్ వ్యాపారం చేసేవాడు. ఇటీవల ఫైనాన్స్ ద్వారా వరికోత యంత్రాన్ని కొనుగోలు చేశాడు. దీనికితోడు ఇంటి నిర్మాణం, కుమార్తెకు వివాహం చేసి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. అప్పుల భారం అధికం కావడంతో కొంతకాలంగా కూలి పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుమార్తె నిండు గర్భిణి కాగా కుమారుడు తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. తీర్చే మార్గం లేకపోవడంతో మనస్తాపం చెందిన శ్రీను మంగళవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనా స్థలాన్ని రాజానగరం పోలీసులు పరిశీలించి, పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పి.కాశీవిశ్వనాథ్ తెలిపారు.

స్కూల్‌బస్సు ఢీకొని అంగన్‌వాడీ చిన్నారి మృతి

దివాన్‌చెరువు, మార్చి 19: రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలచర్ల గ్రామంలో ప్రైవేట్ స్కూల్‌బస్సు ఢీకొని అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న నాలుగేళ్ల చిన్నారి బండి శ్రీవల్లి(4) మృతి చెందింది. మంగళవారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన శ్రీవల్లి మధ్యాహ్నం భోజన సమయంలో మరో ఇద్దరు చిన్నారులతో కలసి ఆయా సహాయంతో మూత్రవిసర్జనకు బయటకు వచ్చింది. బాలిక వెంట వచ్చిన ఇద్దరు చిన్నారులు మూత్ర విసర్జన అనంతరం కేంద్రానికి బయలుదేరి వెళ్లడంతో వారి కోసం ఆయా చిన్నారి శ్రీవల్లీని వదిలి ముందుకు వెళ్లింది. ఈ క్రమంలో అటుగా అతివేగంగా వస్తున్న ప్రైవేట్ స్కూల్‌బస్సు శ్రీవల్లీని ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన బాలికను చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	కుంగ్‌ఫూ పాండా..
వై.స్క్రీన్2	ప్రేమలు
దేవిశ్రీ(గాయత్రి)	వెయ్ దరువెయ్
అనన్య	భీమా

నిడదవోలు

వీ మ్యాక్స్	ప్రేమలు
రాధాకృష్ణ	భీమా
శ్రీగణపతి	వెయ్ దరువెయ్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	గామి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	భీమా

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి